## విలేకరులు కావలెను

### పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily





సంపుటి : 4 | సంచిక :40 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | శనివారం 4 జూలై 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool




## రాష్ట్రంలో పైలట్ ప్రాజెక్టుగా సీబీడీసీ

మరావతి: పౌరసరఫరాల సేవల్లో పారదర్శకత, జవాబుదారీతనం తీసుకువచ్చేలా గుజరాత్ రాష్ట్రంలో పైలట్ ప్రాజెక్టుగా అమలవుతున్న 'సెంట్రల్ బ్యాంకు డిజిటల్ కరెన్సీ' పథకాన్ని ఏపీలోనూ ప్రయోగాత్మకంగా అమలు చేస్తామని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. పౌరసరఫరాల శాఖ కమిషనర్ కన్నబాబుతో కలిసి ఆయన గుజరాత్‌లోని గాంధీనగర్, అహ్మదాబాద్ నగరాల్లో శుక్రవారం పర్యటించారు. క్షేత్రస్థాయిలో పథకం అమలు తీరును పరిశీలించారు. అనంతరం గుజరాత్ రాష్ట్ర పౌరసరఫరాలశాఖ అధికారులతో సమావేశమయ్యారు. 'సీబీడీసీ పథకంలో పౌరసరఫరాల సేవలు అందుకునే లబ్ధిదారులు తమకు ఇష్టమైన సరకులు, కొలత ప్రకారం కొనుక్కోవచ్చు. కేవలం ప్రజా పంపిణీ వ్యవస్థలో ఇచ్చిన సరకులే కాకుండా ప్రజలకు నచ్చిన అవసరమైన సరకులను డిజిటల్ రూపీ ద్వారా చెల్లించి తీసుకోవచ్చు. ఆంధ్రప్రదేశ్‌లోనూ విజయవాడ, విశాఖ వంటి చోట్ల ఈ పథకాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేయాలని భావిస్తున్నాం' అని మంత్రి మనోహర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వివరాలు 2లో..




వివరాలు 2లో..

- సున్నపురాళ్లపల్లి వద్ద జేఎస్‌డబ్ల్యూ గ్రీన్ స్టీల్ ప్లాంట్ పనులకు చంద్రబాబు శ్రీకారం
- ప్రకటన విడుదల చేసిన నారా లోకేశ్
- సీమ దశాబ్దాల కలను నిజం చేస్తూ చారిత్రాత్మక అడుగు వేశామని వ్యాఖ్య
- ఈ ప్రాజెక్టుతో స్థానిక యువతకు వేలాది ఉద్యోగాలు లభిస్తాయని ధీమా
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఏపీని ప్రగతి పథంలో నిలుపుతామన్న లోకేశ్

రాయలసీమ ప్రజల దశాబ్దాల కల అయిన కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణంలో మరో చారిత్రాత్మక అడుగు పడిందని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం క్షేత్రస్థాయిలో పనులను వేగవంతం చేశామని ఆయన శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈ ప్రాజెక్టు ద్వారా

# రెండేళ్లలో రాయలసీమ ఉక్కు

- పారిశ్రామిక సిరికి చిరునామాగా ఈ ప్రాంతం
- జేఎస్‌డబ్ల్యూ రాయలసీమ స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనుల ప్రారంభోత్సవంలో సీఎం చంద్రబాబు
- మతిస్థిమితం లేని జగన్ నోట.. రోజుకో మాట వస్తోందని మండిపాటు



కడప: వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు మండలం సున్నపురాళ్లపల్లె వేదికగా రూ.16,350 కోట్ల పెట్టుబడితో ప్రతిష్ఠాత్మక 'జేఎస్‌డబ్ల్యూ రాయలసీమ స్టీల్‌ప్లాంట్' నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం భూమిపూజ చేశారు. జేఎస్‌డబ్ల్యూ ఛైర్మన్ సజ్జన్ జిందాల్, కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మలతో కలిసి సిమెంట్ వేసి ప్లాంట్ పనులను ప్రారంభించారు. 2028 జులై 3 నాటికి ఇక్కడ ఉక్కు ఉత్పత్తి ప్రారంభమవుతుందని రాయలసీమ బిడ్డగా హామీ ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. దీంతోపాటు రూ.20,350 కోట్లతో చేపట్టనున్న 3,850 మెగావాట్ల 'జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ' సౌర, పవన విద్యుత్తు ప్రాజెక్టులకూ పచ్చజెండా ఊపారు. విజయనగరం జిల్లాలో 1,166 ఎకరాల్లో జేఎస్‌డబ్ల్యూ ఏర్పాటు చేస్తున్న పారిశ్రామిక పార్కునూ ఇదే వేదిక నుంచి సీఎం వర్చువల్‌గా ప్రారంభించారు. సున్నపురాళ్లపల్లె బహిరంగస భలో సీఎం చంద్రబాబు ప్రసంగించారు. 'రాయలసీమ అంటే ఒకప్పుడు కరవు నేల. ఇకపై ఇది జలకళ ఉట్టిపడే పచ్చనిసీమ. కియా కార్లు, రాయల్ ఎన్‌ఫీల్డ్, హీరో బైకులు, డ్రోన్లు, ఫైటర్ జెట్లు, గ్రీన్ ఎనర్జీకి కేరాఫ్ అడ్రస్' అని సీఎం అభివర్ణించారు. ఆర్సెలార్ మిత్తల్, వైజాగ్ స్టీల్, జేఎస్‌డబ్ల్యూల కలయికతో ఆంధ్రప్రదేశ్‌ను ఉక్కు రాష్ట్రంగా మారుస్తామన్నారు. రాయలసీమ రైతులను ఆదుకునేందుకు ఆగస్టు 15 నాటికి మదనపల్లెలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు శంకుస్థాపన చేయనున్నట్లు చంద్రబాబు తెలిపారు.

రాజధాని ఏదో చెప్పలేని దౌర్భాగ్య స్థితిలోకి గత పాలకులు రాష్ట్రాన్ని నెట్టేశారని చంద్రబాబు మండిపడ్డారు. తాము

వివరాలు 2లో..




## విష జ్వరాల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టండి

### మంత్రి సంధ్యారాణికి లోకేశ్ సూచన

అమరావతి: గిరిజనుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా గిరిజన ప్రాంతాల్లో విషజ్వరాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉండవల్లి నివాసంలో లోకేశ్‌తో గిరిజన సంక్షేమ శాఖమంత్రి గుమ్మిడి సంధ్యారాణి శుక్రవారం భేటీ అయ్యారు. ఆమెతో రాష్ట్రంలోని ఐటీడీఏల ప్రస్తుత పరిస్థితులు, ఆయా ప్రాంతాల అభివృద్ధిపై చర్చించారు. అరకు లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, తెదేపాను బలోపేతం చేసేందుకు తీసుకుంటున్న చర్యలను లోకేశ్‌కు సంధ్యారాణి వివరించారు. "లోకేశ్ సూచన మేరకు అరకు లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ఏడు శాసనసభ నియోజకవర్గాల ఇన్‌ఛార్జులతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తాం" అని ఆమె తెలిపారు.

## పొగాకు కొనుగోళ్లలో అక్రమాలు సహించం



మరావతి: 'పొగాకు కొనుగోళ్ల కోసం వేలం నిర్వహించే అన్ని ప్లాట్‌ఫాంలు వెంటనే ప్రారంభించాలి. ప్రతి కంపెనీ తప్పనిసరిగా వేలంలో పాల్గొనాలి. రిజెక్షన్ రేటు కచ్చితంగా తగ్గించాలి. కంపెనీలన్నీ కుమ్మక్కై మంచి పొగాకు బేళ్లపై సీలింగ్ పెట్టి ధరలు తగ్గించినా, అక్రమాలకు పాల్పడినా సహించేది లేదు' అని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు హెచ్చరించారు. పొగాకు కొనుగోళ్లపై ఆయన శుక్రవారం అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, పొగాకు బోర్డు ఛైర్మన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ తదితరులు పాల్గొన్నారు. 'అన్ని గ్రేడ్‌ల పొగాకును కంపెనీలు తప్పనిసరిగా కొనేలా బోర్డు కఠినంగా పర్యవేక్షించాలి. కంపెనీలు సిండికేట్ అయినట్లు తేలితే వాటిపై కఠిన చర్యలు తీసుకోవాలి' అని సూచించారు.

## ఉప ముఖ్యమంత్రితో ఈగల్ విభాగం చీఫ్ భేటీ

### వార్షిక నివేదిక అందజేత

అమరావతి: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను ఈగల్ విభాగం చీఫ్, సైబర్ క్రైమ్ ఐజీ ఆకే రవికృష్ణ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళగిరిలోని ఉప ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో ఈ సమావేశం జరిగింది. ఈగల్ విభాగానికి సంబంధించిన వార్షిక నివేదికను ఆయన పవన్‌కల్యాణ్‌కు అందించారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ నివారణకు ఈగల్ విభాగం తీసుకుంటున్న చర్యలు, సాధించిన ఫలితాలను నివేదికలో పొందుపరిచారు. సామాజిక మాధ్యమాల్లో వేధింపులు, ట్రోలింగ్ అంశాలతో పాటు మహిళలే లక్ష్యంగా అసభ్యకర పోస్టులు పెట్టే వారిపై సైబర్ క్రైం విభాగం ద్వారా తీసుకుంటున్న చర్యల వివరాలను రవికృష్ణ వివరించారు.




## మందుల కొనుగోలు, పంపిణీ వ్యవస్థ ప్రక్షాళనకు కమిటీ



ప్రభుత్వ ఆసుపత్రులకు సరఫరా చేసే మందుల కొనుగోలు, పంపిణీ వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేయాలని, రోగులకు వాటి లభ్యతలో ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చూడాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు. డీఎంఈ డాక్టర్ విష్ణువర్ధన్ నేతృత్వంలో ప్రజారోగ్య శాఖ డైరెక్టర్, సెకండరీ హెల్త్‌లోని సీనియర్ అధికారి, ఏపీఎంఎస్ఐడీసీలో డ్రగ్స్ విభాగం అధికారి, ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, ఫార్మసిస్టులతో కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం సాయంత్రం.. వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్ కుమార్, ఇన్‌ఛార్జి కమిషనర్ చక్రధరబాబు, ఆయుష్ డైరెక్టర్ రోణంకి గోపాలకృష్ణ తదితరులతో సమీక్షించారు. మందుల సరఫరా వ్యవస్థలో తమిళనాడులో అనుసరిస్తున్న ఉత్తమ విధానాలపై

వివరాలు 2లో..

# రెండేళ్లలో రాయలసీమ ఉక్కు

-మొదటిపేజీ తరువాయి

ప్రజలు కాలరెగరేసుకునేలా అమరావతిని నిర్మించి చూపిస్తామన్నారు. వైఎస్ కుటుంబం వల్ల రాయలసీమకు అన్యాయం జరిగిందని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ విమర్శించారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు జోడీతో రాష్ట్రం అన్ని రంగాల్లో ముందడుగు వేస్తున్నట్లు భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. కార్యక్రమంలో మంత్రులు గొట్టిపాటి రవి, సవిత, ఎమ్మెల్యేలు ఆదినారాయణరెడ్డి, వరదరాజులురెడ్డి, చైతన్యరెడ్డి, పుట్టా సుధాకర్‌యాదవ్, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి యువరాజ్, కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ పాల్గొన్నారు.

**చంద్రబాబు లాంటి విజనరీ లీడర్ దేశంలోనే అరుదు: సజ్జన్ జిందాల్**

ముఖ్యమంత్రి చంద్రబాబును జిందాల్ గ్రూప్ ఛైర్మన్ సజ్జన్ జిందాల్ ప్రశంసలతో ముంచెత్తారు. స్టీల్‌ప్లాంట్ పనుల ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'చంద్రబాబు లాంటి విజనరీ నాయకులు అరుదు. ఆయన ఎప్పుడూ రాబోయే 25 ఏళ్ల అభివృద్ధికి ప్రణాళికలు వేసి, సమర్థంగా అమలు చేస్తారు. దేశాభివృద్ధి గురించి నిత్యం పరితపించే ఆయనలాంటి నేతలతో కలిసి పనిచేయడం ఒక పారిశ్రామికవేత్తగా నాకు దక్కిన గౌరవం. కేంద్రంలో మోదీ నాయకత్వానికి, రాష్ట్రంలో చంద్రబాబు లాంటి సమర్థులైన ముఖ్యమంత్రులు తోడైతే దేశం అనుకున్న లక్ష్యాలను మరింత వేగంగా అందుకుంటుంది. మొదటి విడతగా ఏడాదికి మిలియన్ టన్నుల సామర్థ్యంతో ఈ స్టీల్‌ప్లాంట్‌ను నిర్మిస్తున్నాం. భవిష్యత్తులో మరింతగా విస్తరిస్తాం. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ తరఫున దాదాపు రూ.50 వేల కోట్ల భారీ పెట్టుబడులు పెడతాం' అని వివరించారు. ఈ సందర్భంగా రక్షణ రంగం కోసం తయారు చేసిన ట్రక్కును ముఖ్యమంత్రి చంద్రబాబుకు చూపి విశేషాలను వివరించారు.

**జేఎస్‌డబ్ల్యూ ఉక్కు పరిశ్రమకు రూ.68 కోట్లతో అనుసంధాన రోడ్డు**

జేఎస్‌డబ్ల్యూ రాయలసీమ స్టీల్‌ప్లాంటును జాతీయరహదారి-67తో అనుసంధానిస్తూ నాలుగు లేన్ల రహదారి నిర్మాణానికి రూ.68 కోట్లతో రూపొందించిన ప్రతిపాదనకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మొత్తాన్ని ఏపీఐఐసీ నిధుల నుంచి చేపట్టి.. సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తిచేయాలని ఆదేశించింది. సాక్షీ నిధుల నుంచి రీయింబర్స్‌మెంట్ పొందే అంశాన్ని పరిశీలించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

**రక్షణ రంగం కోసం జేఎస్‌డబ్ల్యూ తయారుచేసిన వాహనంలో సీఎం చంద్రబాబు, సజ్జన్ జిందాల్**

రాష్ట్ర విభజన తర్వాత అమరావతిని రాజధానిగా అసెంబ్లీలో అందరూ అంగీకరించారు. నాటి ప్రతిపక్ష నేత కూడా మద్దతు తెలిపారు. 2019లో అధికారంలోకి రాగానే రంగులు మార్చారు. మూడు రాజధానులంటూ ఐదేళ్లపాటు నాటకాలాడారు. అధికారం కోల్పోయాక ఇంకో అవతారం ఎత్తారు.

అమరావతి రాజధానిగా కేంద్రం చట్టం చేశాక మావిగన్ అనే రాగం అందుకున్నారు. నిన్ననేమో విజయవాడ రాజధాని అంటున్నారు. రేపు ఏమంటారో తెలియదు. ఇలా పూటకో మాట మాట్లాడే మతిస్థిమితం లేనివారితో రాజకీయం చేయడం నా జీవితంలో ఎప్పుడూ చూడలేదు'

**మాజీ సీఎం జగన్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు విమర్శలు**


రాయలసీమలో ఫ్యాక్షన్ అంతమైంది. 1995లో నేను ముఖ్యమంత్రి అయ్యాక ఫ్యాక్షన్, ముఠాలు పోవాలని చర్యలు చేపట్టాను. నేడు ఫ్యాక్షన్ లేదు.. ముఠాల్లేవు గానీ, నేరాలు చేసే నాయకులున్నారు. బాబాయిని చంపి, నా చేతిలో గొడ్డలి పెట్టి నేరం నాపై మోపి రాజకీయ లబ్ధి పొందారు.

**సున్నపురాళ్లపల్లె సభలో చంద్రబాబు**

రాయలసీమకు ఎవరి వల్ల మేలు జరిగిందో ప్రజలు గుర్తించాలి. మేం తెచ్చిన కియాతో ఉమ్మడి అనంతపురం జిల్లా దశదిశ మారాయి. గత పాలకులు బ్రాహ్మణి స్టీల్ ప్రాజెక్టు పేరుతో గనుల దోపిడీకి పాల్పడ్డారు. ఓబుళాపురం గనుల పేరుతో భారీగా దోచుకున్నారు. ఎవరిది విశ్వసనీయతో, ఎవరిది దోపిడీనో ప్రజలు అర్థం చేసుకోవాలి.

# రిటైర్డ్ ఉద్యోగుల జీవన భద్రతకు ముప్పు!

: ప్రభుత్వ ఉద్యోగి తన జీవితకాల కష్టార్జితాన్ని, రెక్కల కష్టాన్ని నమ్ముకుని, భవిష్యత్తు అవసరాల కోసం దాచుకునే ప్రధాన వనరు -- రిటైర్మెంట్ బెనిఫిట్స్. పిల్లల చదువులు, కుమార్తెల పెండ్లిళ్లు, ఇల్లు కట్టుకోవడం లేదా అత్యవసర వైద్య ఖర్చుల కోసం వారు ఈ సొమ్మునే ఆశ్రయిస్తారు. అయితే, రాష్ట్రంలో దశాబ్దాల పాటు సేవలు అందించి, రిటైరైన ఉద్యోగులు తమ సొంత సొమ్మును కూడా సకాలంలో తీసుకోలేక తీవ్ర ఆవేదన చెందుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చి దాదాపు మూడేండ్లు కావస్తున్నా తమకు పూర్తి మొత్తంలో రావాల్సిన బకాయిలు అందక వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఉద్యోగ విరమణ తర్వాత ప్రశాంతంగా జీవితాన్ని గడుపుదామనుకునే వారికి ప్రభుత్వ ఉదాసీనత వల్ల తీవ్ర అన్యాయం జరుగుతున్నది. ప్రభుత్వం నుంచి రావలసిన ప్రధాన బెనిఫిట్లు నిలిచిపోవడంతో వృద్ధాప్యంలోనూ ఇతరులపై ఆధారపడాల్సిన పరిస్థితులు దాపురించాయి. 2024 ఏప్రిల్ నుంచి రిటైరైన సుమారు 10 వేల మందికి పైగా ఉద్యోగుల పెన్షన్ ప్రయోజనాలు పూర్తిగా నిలిచిపోయాయి. తీవ్ర ఒత్తిడి, కోర్టు కేసుల నేపథ్యంలో కొంతమంది ఉద్యోగులకు రావాల్సిన బెనిఫిట్లలో కేవలం 30-50 శాతం మాత్రమే చెల్లించి, మిగిలిన మొత్తాన్ని సర్కార్ పెండింగ్‌లో పెట్టింది. అరకొర చెల్లింపుల వల్ల తమ అవసరాలు ఏమాత్రం తీరక రిటైర్డ్ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. కేవలం రిటైర్మెంట్ బెనిఫిట్స్ మాత్రమే కాకుండా, గతంలో రావాల్సిన ఇతర ఆర్థిక ప్రయోజనాలు కూడా వారికి నిలిచిపోయాయి. తాము ప్రతి నెలా జీతం నుంచి పొదుపు చేసుకున్న జీపీఎఫ్ నిధులను సైతం నిలిపివే యడం శోచనీయమని ఆవేదన చెందుతున్నారు. టీఎస్‌జీఎ ల్‌ఐ, గ్రూప్ ఇన్సూరెన్స్, తెలంగాణ స్టేట్ ఇన్సూరెన్స్, జీఐఎస్ బకాయిలు కూడా సకాలంలో చెల్లించడం లేదు. గ్రాట్యుటీ క్రెడిట్ చేయకుండా కేవలం కమ్యూటేషన్ మాత్రమే వేయ డంపై తీవ్ర చర్చ జరుగుతున్నది. వాస్తవానికి కమ్యూటేషన్ ఇచ్చిన మరుసటి నెల నుంచే పెన్షన్‌లో దాదాపు 40 శాతం వరకు రికవరీ జరుగుతుంది. గ్రాట్యుటీ రాకుండా పెన్షన్ మొత్తం తగ్గిపోవడంతో పెద్ద ఆర్థిక భారంగా మిగులుతున్నది. ఎర్న్‌డ్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, జీవితాంతం దాచుకున్న 300 రోజుల సంపాదిత సెలవుల నగదు బిల్లులు కూడా చాలామం దివి ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. పాత పీఆర్సీ బకాయిలు ఇప్పటికీ ఎంతోమందికి పూర్తి స్థాయిలో అందలేదు. గత రెండు నెలలుగా రిటైర్డ్ ఉద్యోగుల జీతాలు/పెన్షన్ల నుంచి ఈహెచ్‌ఎస్ పేరిట రికవరీ చేస్తున్నా, క్యాష్‌లెస్ వైద్య సేవలు అందించే హెల్త్ కార్డ్స్ ఇప్పటికీ అందలేదు. దీనివల్ల వృద్ధాప్యంలో అత్యవసర వైద్య ఖర్చుల కోసం ఇతరులపై ఆధారపడాల్సి వస్తున్నదని వాపోతున్నారు. ఆరు నెలల్లో అమలు చేస్తామన్న పీఆర్సీ, నెలలు గడుస్తున్నా కనీసం నివేదిక కూడా బయటకు రాకపోవడంపై ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు తీవ్ర అసంతృప్తితో ఉన్నాయి. 2024 జనవరి నుంచి రావలసిన సుమారు 6 డీఏ బకాయిల మంజూరులో తీవ్ర ఆలస్యమవుతున్నది. విశ్రాంత ఉద్యోగుల జీవితాలు రోడ్డున పడకుండా ఉండాలంటే..ఉద్యోగ విరమణ చేసిన నెలలోపే వారికి రావాల్సిన అన్ని ప్రయోజనాలను అందించాలి. ఇది వారి ప్రాథమిక హక్కుగా పరిగణించాలి. రిటైర్డ్ ఉద్యోగులు వృద్ధాప్యంలో గౌరవంగా, ఆర్థిక భద్రతతో జీవించేలా చూడటం ప్రభుత్వ కనీస బాధ్యత. వారి చట్టబద్ధమైన హక్కులను కాపాడటానికి, జీవితాంతం దాచుకున్న సొమ్మును సకాలంలో అందించడానికి వెంటనే స్పందించి, తగిన తక్షణ చర్యలు చేపట్టాలి. అత్యవసర అవసరాల కోసం తాత్కాలిక రుణాలు, జీపీఎఫ్ పాక్షిక ఉపసంహరణలకు తక్షణ అనుమతులు మంజూరు చేయాలి. జీపీఎఫ్ ఫైనల్ క్లోజర్ మొత్తంతో పాటు పెండింగ్‌లో ఉన్న గ్రాట్యుటీ, కమ్యూటేషన్, ఈఎల్ ఎన్‌క్యాష్‌మెంట్ నిధులను యుద్ధప్రాతిపదికన విడుదల చేయాలి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రిటైర్డ్ ఉద్యోగుల జీవన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి.



# కొత్త అవతారంలో నరేగా!

ఎవరెన్ని అభ్యంతరాలు చెప్పినా నిరుడు డిసెంబర్‌లో పార్లమెంటు ఆమోదించిన వీబీ-- జీ రాం జీ చట్టం బుధవారం నుంచి అమల్లోకొచ్చింది. ఇది రద్దయిన ఉపాధి హామీ పథకం (నరేగా)కు సరికొత్త అవతారం. గత పథకంలోని 'హక్కుల ప్రాతిపదిక'ను మార్చొద్దనీ, రాష్ట్రాలపై ఆర్థిక భారం పడే విధానానికి స్వస్తిచెప్పి, గతంలో మాదిరే కేంద్రమే భరించాలని పౌరసమాజ కార్యకర్తలతోపాటు కొన్ని రాష్ట్రాలు కూడా కోరాయి. అయితే నరేగా కన్నా ఇదెన్నో రెట్లు మేలని కేంద్రం చెబుతోంది. గత పథకంలో గ్రామీణ ప్రాంతాల్లో ఏడాదికి వంద రోజుల పని దినాలకు అనుమతించగా, తాము మరో 25 రోజులు పెంచామని... కూలీల వేతనాలు పెరిగాయని, వారానికోసారి చెల్లింపులు, ఇతర సంస్కరణలు తీసుకురావటంతో అవినీతికి ఆస్కారం ఉండబోదని కేంద్రం చెబుతోంది. పాత పథకంలో ప్రతి 15 రోజులకొకసారి చెల్లించాలన్న నిబంధన ఉన్నా, బ్యాంకింగ్ సదుపాయాలు అంతంతమాత్రమే కావటంవల్ల నిరుపేద కుటుంబాలు నెలల తరబడి వేచిచూడాల్సివచ్చేది. ఈలోగా రోజులు గడవటానికి అధిక వడ్డీ రేట్లకు అప్పులు చేసే వారు. ఇప్పుడు వారానికొకసారి వేతనాలిస్తామంటున్నా ఈ లోటు పాట్లు సరిదిద్దకపోతే నిరుపయోగమే. గ్రామీణ కూలీలకు మరో 25 రోజులు పనిదొరకటం, అందువల్ల అదనపు ఆదాయం రావటం హర్షించదగ్గది. అయితే నరేగాకింద గ్రామాల్లో సంబంధిత పక్షాల సమావేశాల నిర్ణయాల ఆధారంగా చేయిం చాల్సిన పనులు ఖరారయ్యేవి. తాజా చట్టం ప్రకారం అలాంటి పనులేమిటో కేంద్రం 'వాస్తవ ప్రమాణాల' ఆధారంగా నిర్ణయిస్తుంది. దాని కయ్యే వ్యయాన్ని కూడా అంచనా వేస్తుంది. అందులో 40 శాతాన్ని రాష్ట్రం భరిస్తే, మిగి లిన 60 శాతం నిధులు కేంద్రంనుంచి వస్తాయి. చేయించాల్సిన పనులు, వాటి అంచనా వ్యయం ఆధారంగా వివిధ రాష్ట్రాలకు వేర్వేరు కేటాయింపులుంటాయి. కేంద్రం నిర్దేశించిన పనుల కన్నా అధికంగా చేయించదల్చుకుంటే అందుకయ్యే మొత్తం వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలి. పాత పథకంలో నిధుల దుర్వినియోగం మాట వాస్తవం. కనబడని మనుషుల పేర్లతో కైంకర్యం చేసిన ఉదంతాలు అనేకం బయటపడ్డాయి. అందుకే హిందీ రాష్ట్రాల్లో 'పిశాచ లబ్ధిదారుల'న్న పేరు కూడా వచ్చింది. అయితే ఇప్పుడున్న సాంకేతికత అప్పుడు లేదు. మొత్తం కాగితాలపైనే వ్యవహారాలన్నీ నడిచేవి. ఆన్‌లైన్ వ్యవస్థలు, డిజిటల్ చెల్లింపులు వచ్చాక ఆ బెడద తగ్గింది. 'నరేగా'ను అవినీతి పేరుతో కొట్టిపారేయటం సరికాదు. ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం 2006లో ప్రారంభమైన ఈ పథకం తొలి దశాబ్దకాలంలో దాదాపు కోటిన్నరమంది ప్రజలను దారిద్ర్యంనుంచి విముక్తుల్ని చేసింది. ఇది చిన్న విషయమేం కాదు. అలాగే సగటున మహిళలకు 50 శాతం పనులు దక్కేవి. ఈ పథకంవల్ల సాగు పనులకు కూలీల కొరత వస్తున్నదన్న ఫిర్యాదులు ఉండేవి. కానీ జాతీయ గణాంకాలు మాత్రం సాగు పనులు ముమ్మరంగా ఉండే సమయంలో 'నరేగా'కు డిమాండ్ తక్కువేనని చెబుతున్నాయి. కూలీలకు బేరమాడే శక్తి పెరిగిందనీ, వారి కూలీ రేట్లు పెరిగాయనీ అధ్యయనాలు సూచిస్తున్నాయి. ంకొత్త పథకంలో రాష్ట్రాలు కూడా వ్యయం భరించాల్సిరావటం ఒకరకంగా విషాదం. 'నిధులు నిండుకుంటే హక్కులు నీరసిస్తాయ'ని ఆర్థికవేత్తలు చెబుతుంటారు. ఈ పథ కానికి కేటాయింపుల కోసం రాష్ట్రాలు ముందుగా సంక్షేమ పథకాలకే... మహిళా సంక్షేమా నికే కోత పెడతాయి. గతంలో నిధులు లేక కాదు... అమలుపై ఆసక్తి కొరవడి అత్యధిక పేదరికం ఉండే బిహార్, ఉత్తరప్రదేశ్‌లు అతి తక్కువ నిధులు వినియోగించాయని గణాంకాలు సూచిస్తున్నాయి. ఇప్పుడు నిధుల లేమితో చాలా రాష్ట్రాలు ఆ తోవన పోయినా ఆశ్చర్యం లేదు. మొన్న ఏప్రిల్ సమావేశంలో బీజేపీ పాలిత రాష్ట్రాలైన మధ్యప్రదేశ్, బిహార్‌లతోపాటు జార్ఖండ్, ఉత్తరాఖండ్, తెలంగాణలు నిధుల భారం మోపటాన్ని వ్యతి రేకించాయి. తాజాగా తమిళనాడు సీఎం విజయ్ కూడా గొంతుకలిపారు. ఆశ్చర్యకరంగా ఆంధ్రప్రదేశ్ మాత్రం నిమ్మకునీరెత్తినట్టు ఉండిపోయింది. ఎటూ సంక్షేమాన్ని అరకొరగా చేస్తున్నాం... దాన్ని మరింత కత్తిరిస్తే సరిపోతుందని సీఎం చంద్రబాబు నాయుడు అను కుంటున్నట్టున్నారు. ఏదేమైనా ఆచరణలో వచ్చే సమస్యల్ని అధ్యయనం చేశాకైనా వీబీ-- జీ రాం జీ ని మెరుగుపరచటం మేలు.

## జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్‌తో సీమ దశ మారిపోతుంది: మంత్రి నారా లోకేశ్

-మొదటిపేజీ తరువాయి

రాయలసీమ రూపురేఖలు మారనున్నాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇదే క్రమంలో విజయనగరంలో జేఎస్‌డబ్ల్యూ పారిశ్రామిక పార్కు పనులను కూడా ప్రారంభించినట్లు పేర్కొన్నారు. జమ్మలమడుగు నియోజకవర్గంలోని సున్నపురాళ్లపల్లి వద్ద 2 మిలియన్ టన్నుల సామర్థ్యంతో జేఎస్‌డబ్ల్యూ గ్రీన్ స్టీల్ ప్లాంట్, 350 మెగావాట్ల సామర్థ్యంతో జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ ప్లాంట్ పనులకు ఇవాళ సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టడం తెలిసిందే. దీనిపై లోకేశ్ ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ ప్రాజెక్టుల ద్వారా వేలాది మంది స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని, రాయలసీమ ప్రాంతం ఒక ప్రధాన పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని ఆయన అన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో నిలపాలన్న కూటమి ప్రజా ప్రభుత్వ ఉక్కు సంకల్పానికి ఈ స్టీల్ ప్లాంట్ నిదర్శనమని లోకేశ్ అభివర్ణించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'తో రాష్ట్రాన్ని మళ్లీ ప్రగతి పథంలో నిలుపుతామని ఆయన స్పష్టం చేశారు.

## మందుల కొనుగోలు, పంపిణీ వ్యవస్థ ప్రక్షాళనకు కమిటీ

-మొదటిపేజీ తరువాయి

కమిటీ అధ్యయనం చేసి రెండు వారాల్లోగా నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. పరికరాల కోసం ఏపీఎంఎస్‌ఐడీసీకి వచ్చే ఇండెంట్ల విధానంలోనూ మార్పులు రావాలని సూచించారు. కేంద్ర మంత్రి జేపీ నడ్డా త్వరలో ప్రారంభించనున్న క్రిటికల్ కేర్ బ్లాక్‌ల నిర్మాణాల పురోగతిపై మంత్రి చర్చించారు. పాడేరు, పిడుగురాళ్ల, మచిలీపట్నం ప్రభుత్వ వైద్య కళాశాలతోపాటు, 11 పూర్వ వైద్యకళాశాలల్లో వివిధ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఆయుష్ డిస్పెన్సరీలు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల నిర్మాణం ప్రగతిపై ఆరా తీశారు. తిరుపతి, విశాఖలో రూ.45 కోట్లతో అత్యాధునిక పరికరాలతో సిద్ధమైన స్టేట్ ఫుడ్ ల్యాబరేటరీలకు రాబోయే మూడునెలల్లో ఎన్‌ఏబీఎల్ అక్రిడిటేషన్ తెప్పించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

## పార్లమెంట్‌లో వ్యూహాత్మకంగా కార్యాచరణ

29 లోక్‌సభ ఎన్నికలకు ముందే డీలిమిటేషన్ బిల్లు, మహిళా రిజర్వేషన్ బిల్లుల ఆమోదింప జేసుకోవాలన్న కృతనిశ్చయంతో ఉంది కేంద్రం. రెండింటికి పార్లమెంట్‌లో ఆమోదం పొందేలా?ప్రభుత్వం వ్యూహాత్మకంగా కార్యాచరణను సిద్ధం చేస్తోంది. వర్షాకాల సమావేశాల్లో డీలిమిటేషన్ బిల్లును పునఃప్రవేశపెట్టేందుకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సన్నాహాలు చేస్తోంది. మహిళా కోటా విషయానికొస్తే.. 2023లో ఆమోదించిన మహిళా రిజర్వేషన్ చట్టం ప్రకారం.. పునర్విభజన తర్వాతే 33 శాతం కోటా అమల్లోకి రావాలి. ఎస్సీ, ఎస్టీ రిజర్వ్‌డ్ స్థానాల్లో కూడా వన్-థర్డ్ కోటాను మహిళలకు కేటాయించనున్నారు. దీంతో అదే దామాషాలో ఆయా వర్గాల మహిళలకూ లబ్ధి చేకూరుతున్నట్టే. 2023లో ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ల బిల్లుతో లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు లభిస్తాయి. నియోజకవర్గాల పునర్విభజన కాకపోవడంతో ఈ చట్టం అమల్లోకి రాలేదు. నియోజకవర్గాల పునర్విభజనకు ముందుగానే ఈ చట్టాన్ని అమలు చేయాలంటే మరో రాజ్యాంగ సవరణ తప్పనిసరి. చట్టం ఏర్పడిన తర్వాత వచ్చే మొదటి జనాభా లెక్కల సేకరణ అనంతరం చేపట్టే నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే మహిళలకు రిజర్వేషన్‌ను అమలుచేయాలని చట్టం నిర్దేశిస్తోంది. నియోజకవర్గాల పునర్విభజనకు అతీతంగా ఇది అమలు చేయాలంటే ఈ చట్టంలోని సెక్షన్ 5ని ప్రభుత్వం సవరించాల్సి ఉంటుంది. ఇది పార్లమెంట్ ఉభయ సభల్లో హాజరైన సభ్యుల్లో మూడింట రెండు వంతుల మంది ఆమోదంతోనే చట్ట సవరణ చేయాల్సి ఉంటుందని? రాజ్యాంగంలోని 368(2) అధికరణ నిర్దేశిస్తోంది.నియోజకవర్గాల పునర్విభజన జరగాలంటే పలు రాజ్యాంగ సవరణలు చేయాల్సి ఉంటుంది. అలా రాజ్యాంగ సవరణ కోసం ప్రవేశపెట్టే బిల్లులకు ఉభయ సభల్లో ప్రత్యేక మెజారిటీ అవసరం. సభలో సభ్యుల హాజరు సగానికిపైగా ఉండాలి. హాజరైన వారిలో మూడింట రెండు వంతుల మంది ఆ బిల్లుకు మద్దతు తెలుపాలి. అప్పుడే ఆ బిల్లు ఆమోదం పొందుతుంది. లోక్‌సభలో ప్రస్తుతం ఉన్న 540 మంది ఎంపీలు సభకు హాజరైతే.. వారిలో 360 మంది తప్పనిసరిగా బిల్లుకు మద్దతు తెలపాలి. లోక్‌సభలో ఆమోదం పొందిన బిల్లు రాజ్యసభ ముందుకు వస్తుంది. రాజ్యసభలో ప్రస్తుతం ఉన్న 244 మంది సభ్యులు సభకు హాజరైతే.. 163 మంది బిల్లుకు మద్దతు తెలపాలి. అప్పుడే ఆ బిల్లు రాష్ట్రపతి ఆమోదం అనంతరం చట్టంగా మారుతుంది. కానీ అధికార ఎన్డీయే కూటమికి ఉభయ సభల్లో ఇప్పుడు అంత బలం లేదు. అందుకే ఆ బలం కూడగట్టానికి రకరకాల రాజకీయ వ్యూహాలకు పదును పెడుతున్నారు.ఏప్రిల్‌లో మహిళా రిజర్వేషన్ ప్యాకేజీలో భాగంగా వచ్చిన డీలిమిటేషన్‌కు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో 54 ఓట్ల తేడాతో ఆమోదం పొందలేదు. అయితే తాజా రాజకీయ పరిణామాల తరుణంలో అదే బిల్లు మళ్లీ ప్రవేశపెడితే ఆమోదం పొందే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ప్రస్తుతం లోక్‌సభలో బలాబలాలు చూస్తే.. మొత్తం సభ్యుల సంఖ్య 543గా ఉంది. మూడు సీట్లు ఖాళీగా ఉన్నాయి. అంటే ప్రస్తుత సభ్యుల సంఖ్య 540 మాత్రమే. మూడింట రెండొంతుల మెజార్టీ అంటే 360 మంది మద్దతు కావాలి. ఎన్డీఏకు ప్రస్తుతం 318 మంది సభ్యులున్నారు. ప్రతిపక్షానికి 184 మంది సభ్యుల బలం ఉంది. ఇతరులు 38 మంది ఉన్నారు. బడ్జెట్ సమావేశాల్లో మహిళా రిజర్వేషన్, రాజ్యాంగ సవరణ బిల్లుల ఓటింగ్ సమయంలో 528 మంది సభ్యులు హాజరయ్యారు. అప్పుడు బిల్లు ఆమోదానికి 352 ఓట్లు అవసరమయ్యాయి. ఎన్డీయే కు అనుకూలంగా 298 ఓట్లు మాత్రమే రావడంతో 54 ఓట్ల తేడాతో బిల్లు ఆగిపోయింది. కానీ అప్పటికి, ఇప్పటికి పరిస్థితులు మారిపోయాయి. ప్రస్తుతం టీఎంసీ రెబల్ ఎంపీలు 20 మంది, ఉద్ధవ్ థాక్రే శివసేన ఎంపీలు ఆరుగురు కలిపి ఎన్డీఏ ఖాతాలోకి 26 ఓట్లు అదనంగా వస్తాయని అంచనా. అప్పుడు లోక్‌సభలో ఎన్డీఏ బలం 318 నుంచి 344కు పెరుగుతుంది.స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే కాంగ్రెస్‌తో విభేదాల తరుణంలో ఇండి కూటమికి దూరమైంది. ఇప్పటికే బీజేపీ డీఎంకేను ఎన్డీఏలోకి ఆహ్వానించిందనే ప్రచారం జరుగుతోంది. డీఎంకే ఎన్డీఏలో చేరకపోయినా.. లోక్‌సభలో ఎన్డీఏకు జై కొడితే.. ఆ పార్టీకి చెందిన 22 మంది ఎంపీల బలం కూడా జత కలుస్తుంది. అప్పుడు ఎన్డీఏ బలం ఏకంగా 344 నుంచి 366కు పెరుగుతుంది. ఇప్పటికే ఈ మేరకు స్టాలిన్ నుంచి హామీ ఉందని కూడా బీజేపీ వ్యూహాత్మకంగా ప్రచారం చేసుకుంటోంది. సరే ఇక్కడివరకు లోక్‌సభలో పరిస్థితి ఓకే. కానీ కీలకమైన రాజ్యసభ సంగతేంటి అనే ప్రశ్న వస్తుంది. రాజ్యసభలో రెండొంతుల మెజారిటీకి 164 మంది సభ్యుల మద్దతు అవసరం. ప్రస్తుతం ఎన్డీఏ దగ్గర 150 మంది సభ్యులు ఉన్నారు. ఇక్కడ కూడా డీఎంకేకు చెందిన 8 మంది సభ్యుల మద్దతు లభిస్తే సంఖ్య 158కు చేరుతుంది. అప్పుడు మరో ఆరుగురు సభ్యుల మద్దతు అవసరం అవుతుంది. అయితే వచ్చే సెషన్‌లో మహిళా, డీలిమిటేషన్ బిల్లులు వచ్చే సమయానికి.. ఏదో రకంగా ఈ బలం సమకూర్చుకోవచ్చనేది బీజేపీ ఆలోచనగా ఉంది. పైగా ఒక్కసారి బిల్లులు లోక్‌సభ ఆమోదం పొందితే.. రాజ్యసభలో అనుకోని విధంగా మద్దతు లభిస్తుందనే లెక్కలు కూడా లేకపోలేదు.ఇప్పటికే టీఎంసీ, శివసేన యూబీటీ నుంచి ఎంపీల్ని ఆకర్షించి మద్దతు కూడగట్టడంలో సఫలమైన బీజేపీ..ఇప్పుడు శరద్ పవార్ ఎన్సీపీ, నవీన్ పట్నాయక్ బిజూ జనతాదళ్, పంజాబ్‌లో ఆప్ మీద కూడా కన్నేసినట్టు చెబుతున్నారు. త్వరలో ఈ ఆపరేషన్లు కూడా కొలిక్కి వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. కొన్ని చిన్న పార్టీలతో చర్చలు పూర్తయ్యాయని, పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు మొదలయ్యాక విపక్షానికి మరిన్ని షాకులిచ్చే ఉద్దేశంతో బీజేపీ ఉందనే చర్చ జరుగుతోంది. ఏదే?నా ప్రస్తుతం హస్తిన వేదికగా రాజకీయ వ్యూహాలు జోరుగా సాగుతున్నాయి. నయానో భయానో ఎంపీల బలం పెంచుకోవటానికి బీజేపీ అన్ని ప్రయత్నాలు చేస్తోంది. కుదిరితే రాష్ట్ర స్థాయి నేతలు, పార్టీ సీఎంలు, అవసరమైతే అగ్రనేతలే నేరుగా రంగంలోకి దిగి పని పూర్తిచేయాలనే కార్యాచరణ సిద్ధమైంది. అన్నింటికీ మించి డీలిమిటేషన్ బిల్లును తిప్పికొట్టామనే ఆత్మవిశ్వాసంతో తొణికిసలాడుతున్న ప్రతిపక్ష కూటమిని నైతికంగా చావుదెబ్బ కొట్టాలనేది కాషాయ పార్టీ లక్ష్యంగా ఉంది. అందుకే ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు రాగానే రాజకీయ సమీకరణాలు మార్చే పని మొదలుపెట్టారనే అభిప్రాయాలు వస్తున్నాయి.లోక్ సభ నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించి కేంద్రం మరో ప్రతిపాదనను కూడా పరిశీలిస్తోంది. లోక్ సభ నియోజకవర్గాలను ప్రస్తుతం ఉన్న 543 నుంచి 824కి పెంచాలని ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి ఇప్పటికే సూచన చేసింది. . అంటే ప్రతీ రాష్ట్రంలో ఉన్న సీట్లలో మరో యాభై శాతం పెంచే బదులుగా?మరో కొత్త ఫార్ములాతో ఈ మండలి ప్రతిపాదనలు ఉండడం ఆసక్తిని పెంచుతోంది. మూడో వంతు పార్లమెంట్ సీట్లను మాత్రమే పెంచాలని ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి సిఫార్సు చేసినట్లుగా తెలుస్తోంది. అంటే 170 పార్లమెంట్ నియోజకవర్గాలలోనే పునర్ విభజన ఉండనుంది. 59 పార్లమెంట్ నియోజకవర్గాలను రెండుగా విభజించాలని? మరో 111 సీట్లను మూడుగా చేయాలని మండలి సూచించినట్లు ప్రచారం జరుగుతోంది. మరి ఇప్పుడు వర్షాకాల సమావేశాల్లో పార్లమెంట్ ముందుకొచ్చే బిల్లు ఇలాగే ఉంటుందా.. మరేదైనా మార్పు చేస్తారా అనేది చూడాల్సి ఉంది.మోడీ ప్రధాని అయ్యాక పార్లమెంట్‌లో ఏ బిల్లు ఆమోదం విషయంలోనూ ఎన్డీఏ సర్కారు ఇబ్బంది పడలేదు. అందుకే రెండు నెలల క్రితం మహిళా రిజర్వేషన్ బిల్లు, డీలిమిటేషన్ బిల్లులు వచ్చినప్పుడు కూడా సర్కారు పకడ్బందీ ప్లాన్‌తోనే వచ్చుంటుందనే చర్చ జరిగింది. కానీ అధికార పక్షానికి షాకిస్తూ ఒక్కతాటిపైకి వచ్చిన విపక్షం.. ఆ రెండు బిల్లుల్ని తిప్పికొట్టింది. దీంతో ఎక్కడైనా అతివిశ్వాసానికి పోయామా అని ఎన్డీఏలో అంతర్గత చర్చ జరిగింది. ఆ సందర్భంగా పార్లమెంట్‌లో అనుసరించిన వ్యూహం.. విపక్షాల్ని ఎందుకు ఒప్పించలేకపోయామనే ప్రశ్నలకు సమాధానాలపై సమీక్ష జరిగింది. అప్పుడు జరిగిన పొరపాట్లు మరోసారి జరగకుండా.. అన్ని జాగ్రత్తలు తీసుకుని.. ఇంకా చెప్పాలంటే ప్లాన్ బీ కూడా రెడీగా పెట్టుకుని మరీ ఈసారి కేంద్రం రంగంలోకి దిగుతోందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.ఇక్కడ డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లుల మద్దతే అసలు ఉద్దేశం కాదు. ప్రధానంగా 2/3 వ వంతు మెజార్టీ కూడగట్టడమే అసలు లక్ష్యం. అప్పుడే ఈ బిల్లులతో పాటు భవిష్యత్తులో యూనిఫామ్ సివిల్ కోడ్ అయినా.. వన్ నేషన్ వన్ ఎలక్షన్ బిల్లులైనా సాఫీగా ఆమోదం పొందుతాయనేది బీజేపీ దూరాలోచనగా ఉంది. అందుకే ఈ లక్ష్యాన్ని తేలిగ్గా తీసుకోవటానికి కాషాయ పార్టీ సిద్ధంగా లేదు.

# రైతన్నల శ్రేయస్సే కూటమి ప్రభుత్వ లక్ష్యం.

- రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ.
- కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానంద రావు.

**కొత్తపల్లి, పెన్ సత్తా, జూలై 03:**మీ భూమి మీకే సొంతం, ఆ భూమి పై మరెవ్వరికీ హక్కు లేదు అని చాటడానికి రాజముద్రతో రైతన్నలకు పట్టాదారు పాస్ పుస్తకాలను అందిస్తున్నామని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానంద రావు వ్యాఖ్యానించారు. రావులపాలెం మండలం పొడగట్లపల్లిలో శుక్రవారం జరిగిన పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రైతన్నలకు పాస్ పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న అన్నదాతల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందన్నారు. తాత, ముత్తాతల నుంచి వచ్చిన ఆస్తులను కాపాడు కోవడానికి ఇబ్బందులు ఎదుర్కొన్న పరిస్థితి వైసీపీ హయంలో ఉండేదన్నారు. వైసీపీ ప్రభుత్వ హయంలో అన్నదాతల భూములకు రక్షణ లేకుండా పోయిందన్నారు. సరిహద్దు రాళ్ల పై, పట్టాదారు పాస్ పుస్తకాల పై జగన్ తన బొమ్మలు వేసుకుని రైతన్నలకు తీవ్ర అన్యాయం చేశాడన్నారు. అలాగే దానికి తోడుగా ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తీసుకువచ్చి కోర్టులకు కూడా వెళ్లకుండా చేసి తమ చెప్పు చేతల్లో రైతుల హక్కులు పెట్టుకున్నారన్నారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం అధికారం లోకి రాగానే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేస్తామని చెప్పి, అధికారం లోకి రాగానే రద్దు చేశామన్నారు. కూటమి ప్రభుత్వం హయాంలో నూతనంగా పట్టాదారు పాస్ పుస్తకాలు ప్రభుత్వ రాజముద్రతో పంపిణీ చేస్తున్నామన్నారు. రైతుల పట్ల ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు ఇదే నిదర్శనమన్నారు. నా పూర్వీకుల ఆస్తి నా సొంతం అనేలా రాజముద్రతో పుస్తకాలు ఇస్తున్నామన్నారు. అలాగే రీసర్వేలో జరిగిన అవకతవకలు, రైతులు పడుతున్న ఇబ్బందులు చక్కదిద్దడానికి ప్రభుత్వం పెనుమార్పులు తీసుకువచ్చిందన్నారు. పాసు పుస్తకాల్లో ఏదైనా తప్పులు దొర్లితే సరిచేయడానికి కలెక్టర్ వరకూ వెళ్లాల్సిన అవసరం లేకుండా కలెక్టర్ కి, జాయింట్ కలెక్టర్ కి ఉన్న అధికారాలను ఆర్డీవోలకు, తాసిల్దార్ల కి బదిలీ చేసి రైతులకు ఎంతగానో మేలు జరిగేలా చేశారన్నారు. దీనితో రైతులకు ఏర్పడుతున్న ఇబ్బందులు స్థానికంగా పరిష్కరించడానికి సులువైన మార్గం ఏర్పడిందన్నారు. అయినా ఇంకా అనేకచోట్ల చాలా





సమస్యలు నెలకొని ఉన్నాయని వాటన్నిటినీ పరిష్కరిస్తున్నామని తెలిపారు.

# దేవాలయ భూముల రక్షణకు ఎమ్మెల్యే యార్లగడ్డ చొరవ.

- వేణుగోపాల స్వామి ఆలయ భూమి పై ఆక్రమణలకు అడ్డుకట్ట వేసిన రెవిన్యూ అధికారులు.
- అక్రమ రిజిస్ట్రేషన్లు, ఆక్రమణల పై కఠిన చర్యలు తీసుకుంటాం తహసీల్దార్.

**గన్నవరం, పెన్ సత్తా, జూలై 03:** మండలం లోని ముస్తాబాద్ గ్రామంలో వేణుగోపాల స్వామి దేవాలయానికి చెందిన భూమిని ఆక్రమణల నుంచి రక్షించేందుకు గన్నవరం ఎమ్మెల్యే, ఏపీ ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాల మేరకు చర్యలు చేపట్టినట్లు తహసీల్దార్ శివయ్య తెలిపారు. ఇటీవల నిర్వహించిన ప్రజాదర్బార్‌లో గ్రామస్థులు దేవాలయానికి చెందిన సర్వే నంబర్ 424/1లోని సుమారు 0.24 సెంట్ల భూమి పై అక్రమ రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించారు. విచారణలో ఆ భూమి గత 60 ఏళ్లుగా స్వామివారి కళ్యాణోత్సవాలు, అన్నదానాలు, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలకు వినియోగంలో ఉన్నట్లు నిర్ధారణ అయింది. ఈ నేపథ్యంలో భూమిని ఎండోమెంట్ శాఖ శాశ్వత రిజిస్టర్‌లో నమోదు చేయడంతో పాటు ప్రభుత్వ



నిషేధిత ఆస్తుల జాబితాలో చేర్చాలని ఎండోమెంట్ కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపినట్లు ఎమ్మార్వో శివయ్య తెలిపారు. అలాగే అక్రమ ఆక్రమణలు, రిజిస్ట్రేషన్లు జరగకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీసు స్టేషన్ హౌస్ ఆఫీసర్ కు లేఖ రాసినట్లు వెల్లడించారు. దేవాదాయ శాఖకు చెందిన భూముల పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, ఆక్రమణలు, అక్రమ రిజిస్ట్రేషన్లపై కఠిన చర్యలు కొనసాగుతాయని తహసీల్దార్ శివయ్య స్పష్టం చేశారు.

# గ్రామాల అభివృద్ధితో పాటు యువతకు ఉపాధి ఉద్యోగ కల్పనే లక్ష్యం యార్లగడ్డ







- కేసరపల్లిలో జూలై 17 న ఉచిత ఏఐ శిక్షణ కేంద్రం ప్రారంభం యార్లగడ్డ.
- కోడూరుపాడు, శేరి నరసన్నపాలెం, వీరవల్లిలో రూ.1.07 కోట్ల సీసీ రోడ్ల ప్రారంభం.
- వీరవల్లిలో ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే.

**గన్నవరం, పెన్ సత్తా, జూలై 03:**
గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనతోపాటు యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించడమే తన ప్రధాన లక్ష్యమని ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. బాపులపాడు మండలం లోని కోడూరుపాడు, శేరి నరసన్నపాలెం, వీరవల్లి గ్రామాల్లో రూ.1.07 కోట్ల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను శుక్రవారం ఆయన ప్రారంభించారు. వీరవల్లి లోని లక్ష్మీ తిరుపతమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం జెడ్పీ హైస్కూల్‌లో ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గన్నవరం మండలం కేసరపల్లి గ్రామంలో ఈ నెల 17 న ఉచిత ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. హెచ్‌సీఎల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిక్షణ ద్వారా బీఎస్సీ, బీకాం (కంప్యూటర్స్), బీటెక్ తదితర కోర్సులు పూర్తి చేసిన యువత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంలో శిక్షణ పొందితే ప్రముఖ ఐటీ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు పొందే వీలుంటుందని చెప్పారు. ఈ శిక్షణ పై ప్రతి గ్రామంలో విస్తృత ప్రచారం నిర్వహించి అర్హులైన యువతను నమోదు చేయించాలని పార్టీ నాయకులు, అధికారులను ఆదేశించారు. దేశంలో రాబోయే కాలంలో ఏఐ, సెమీకండక్టర్ రంగాల్లో అపార అవకాశాలు ఉన్నాయని, యువత వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గన్నవరం నియోజకవర్గ యువతకు మంచి ఉద్యోగాలు రావడమే తనకు అత్యంత సంతృప్తినిచ్చే అంశమని పేర్కొన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో గ్రామాల్లో మౌలిక వసతులు దెబ్బతిన్నాయని, ప్రస్తుతం ప్రభుత్వం నిధుల కొరత ఉన్నప్పటికీ అభివృద్ధి పనులను వేగవంతం చేస్తోందన్నారు. కోడూరుపాడులో రూ.49 లక్షలు, శేరి నరసన్నపాలెంలో రూ.16 లక్షలు, వీరవల్లిలో రూ.42 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించినట్లు తెలిపారు. కోడూరుపాడులో ఇప్పటికే రూ.2 కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేపట్టామని, మరిన్ని పనులకు నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. వీరవల్లి గ్రామంలో సీసీ రోడ్లతో పాటు విద్యుత్ స్తంభాల మార్పు, తాగునీటి పైప్‌లైన్, కాలువల పునరుద్ధరణ, ఆర్అండ్‌బీ రహదారి అభివృద్ధి తదితర పనులకు రూ.5.71 కోట్ల మేర నిధులు మంజూరు చేసి పనులు చేపట్టినట్లు వెల్లడించారు. గ్రామాల్లో తాగునీరు, డ్రైనేజీలు, రహదారులు తదితర మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని స్పష్టం చేశారు. పోలవరం కెనాల్‌ను ఏలూరు కాలువతో అనుసంధానించే పనులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.38 కోట్లకు పైగా నిధులు మంజూరు చేయడం రైతులకు ఎంతో ప్రయోజనకరమని అన్నారు. దీనివల్ల వేల ఎకరాలకు సాగునీటి స్థిరీకరణ లభిస్తుందని తెలిపారు. నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బుడమేరు వరదల నివారణ, ఏలూరు కాలువ ఆయకట్టు రక్షణ కోసం ఎనికేపాడు అండర్ టన్నెల్ సామర్థ్యాన్ని 2 వేల క్యూసెక్కుల నుంచి 20 వేల క్యూసెక్కులకు పెంచేందుకు రూ.36 కోట్లతో పనులు చేపట్టినట్లు తెలిపారు. గ్రామాల్లో ఇళ్ల స్థలాలు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు తదితర సమస్యల పై ప్రజలు అందించిన అర్జీలను పరిశీలించి దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పార్టీ నాయకులు, అధికారులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి షేక్ షాహిద్ బాబు, మండల తహసిల్దార్ మురళీకృష్ణ, ఎంపీడీవో జోగేశ్వర రావు, రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ దయాల రాజేశ్వరరావు, జనసేన పార్టీ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్, నాగార్జునసాగర్ లెఫ్ట్ మెయిన్ కెనాల్ వైస్ చైర్మన్ ఆళ్ల వెంకట గోపాలకృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి పుట్టా సురేష్, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు మొవ్వ వెంకటేశ్వర రావు, సీనియర్ టీడీపీ నాయకులు వేములపల్లి శ్రీనివాస రావు, గుండపనేని ఉమావరప్రసాద్, అమృతపల్లి సూర్యనారాయణ, కలపాల వెంకట నాగ శివప్రసాద్, డీసీ చైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్, మండాది రవీంద్ర, లంకా అజయ్, గరికపాటి వెంకటేశ్వర రావు, మొవ్వ వేణుగోపాల్, చలసాని శ్రీనివాస రావు, ఆర్నేపల్లి సూరిబాబు, చిలకపాటి శ్రీనివాస రావు, మాలావతుల శ్రీనివాస రావు, చిన్నాల లక్ష్మీనారాయణ, కర్రా ప్రసాద్ పాల్, కొసరాజు సాయిరాం, భీమవరపు పాండు రంగారావు, కొల్లూరు చంద్రకాంత్, అక్కినేని కృష్ణాజీ, కొండేటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## మానవత్వాన్ని చాటుకున్న కలెక్టర్ విజయ కృష్ణన్.



**అనకాపల్లి, పెన్ సత్తా, జూలై 03:** విధి నిర్వహణ లోనే కాకుండా మానవత్వం లోనూ ఆదర్శంగా నిలుస్తూ అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ మరోసారి తన సున్నిత మనసును చాటుకున్నారు.
శుక్రవారం మాడుగులలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో పాల్గొని తిరిగి వస్తున్న సందర్భంగా, బంగారు మెట్ట వద్ద రహదారి పక్కన కురుస్తున్న వర్షంలో బస్సు కోసం వేచి చూస్తున్న పలువురు విద్యార్థులను కలెక్టర్ గమనించారు. వెంటనే తన వాహనాన్ని ఆపించి వారి వివరాలు తెలుసుకుని, వారిని తన కారులో ఎక్కించుకుని బంగారు మెట్ట జంక్షన్ నుంచి చిన్నప్పనపాలెం వరకు సురక్షితంగా దింపించారు. విద్యార్థులు వర్షంలో ఇబ్బంది పడకుండా వెంటనే స్పందించి వారికి లిఫ్ట్ ఇవ్వడం అక్కడి స్థానికులను ఆకట్టుకుంది. కలెక్టర్ చూపిన మానవత్వం, బాధ్యతాయుత మైన స్పందనకు స్థానికులు, ప్రజలు అభినందనలు తెలిపారు.

## అనకాపల్లి రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక






**అనకాపల్లి, పెన్ సత్తా, జూలై 03:**
రోటరీ క్లబ్ అనకాపల్లి క్లబ్ సర్వ సభ్య సమావేశం స్థానిక న్యూ కాలనీ రోటరీ హాల్లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో క్లబ్ సభ్యులందరూ ఏకగ్రీవంగా కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. క్లబ్ అనకాపల్లి పట్టణ కొత్త కార్యవర్గంలో అధ్యక్షుడుగా బొగ్గారపు సోమ సుందర్రావు, కార్యదర్శిగా ఎ.వి.ఎస్. ఆర్ కుష్వాంత్, ట్రెజరుగా ఎస్ కృష్ణ వీరితోపాటు 20 మంది కార్యవర్గ సభ్యులు లను ఎన్నుకోవడం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా జిల్లా పంచాయతీరాజ్ పిడి ఈ సందీప్ పాల్గొన్నారు. ముందుగా గత సంవత్సరం అధ్యక్షులు బుద్ద శ్రీనివాసరావు, సెక్రెటరీ కెవిపిఎస్ ప్రకాష్ రావు గత సంవత్సరం నిర్వహించిన సేవా కార్యక్రమాలు గురించి క్లబ్ సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి సందీప్ మాట్లాడుతూ క్లబ్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం సంతోషంగా ఉందని ఆయన తెలియజేశారు. అన్ని భాషల కంటే తెలుగు భాష విశిష్ట మైందని ఆయన తెలియజేశారు. ప్రతి ఒక్కరూ పలు సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆయన తెలియజేశారు. అనకాపల్లిలో ప్రతివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్మించి కంటి ఆపరేషన్లు చేస్తున్నారని ఆయన తెలియజేశారు. రోటరీ క్లబ్బు సేవా కార్యక్రమంలో భాగంగా ఎన్టీఆర్ వైద్యానికి ఐదు వీల్ చైర్ లను పంపిణీ చేశారు, పేదవారికి 10 కేజీల బియ్యం ప్యాకెట్లను పంపిణీ చేశారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులను సభ్యులను క్లబ్ సభ్యులందరూ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి శేష్ కుమార్, సానా త్రినాధ రావు, ఏ ఎల్ ఎన్ కుమార్, కోరుకొండ బుచ్చిరాజు, బుద్ధ రమణా జి, కడిమిశెట్టి సతీష్, పి రాజేశ్వరి ప్రసాద్, ఆరెపు కామేశ్వరరావు, బుద్ద సత్యనారాయణ, డాక్టర్ డి డి నాయుడు, బిఎస్ గుప్తా, బుద్ధపు ప్రసాద్, జెర్రిపోతుల రమణజీ తదితరులు పాల్గొన్నారు.

పెన్ సత్తా
శనివారం 4 జూలై 2026

## యునైటెడ్ అరబ్ ఎమిరేటర్స్ కోఆర్డినేటర్ మెంబర్ గా దవరసింగి రాజా


- హర్షం వ్యక్తం చేసిన జనసేన నాయకులు



**నక్కపల్లి, పెన్ సత్తా, జులై 03:** దేశ విదేశాలలో ఉన్న ప్రవాస ఆంధ్రుల అభ్యున్నతికి, సంక్షేమానికి పాటుపడుతున్న ఏపీ ఎన్ ఆర్ టి ఎస్ ( ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ ) కోఆర్డినేటర్లను ప్రభుత్వం నియమించింది. యూ ఏ ఈ ( యునైటెడ్ అరబ్ ఎమిరేట్ )కమిటీలో నక్కపల్లి మండలానికి చెందిన జనసేన కార్యకర్త దవర సింగ్ రాజాకు మెంబర్ గా స్థానం లభించింది. ఉద్యోగరీత్యా దుబాయ్ లో ఉంటూ ఆంధ్రప్రదేశ్ జనసేన పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్న రాజాను కోఆర్డినేటర్ మెంబర్గా నియమించడం పట్ల నక్కపల్లి జనసేన నాయకులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి కొండపల్లి శ్రీనివాస్ , హోం మంత్రి వంగలపూడి అనిత , ఎం ఎల్ సి నాగబాబు , ఏ పి ఎన్ ఆర్ టి సోసైటి ప్రెసిడెంట్ రవికుమార్ , గల్ఫ్ జనసేన ఇంచార్జ్ కేసరి త్రిమూర్తులు , జనసేన పార్టీ ఇంచార్జ్ గెడ్డం బుజ్జి లకు నక్కపల్లి జనసేన నాయకులు, అభిమానులు ధన్యవాదాలు తెలియజేశారు.

## రిజిస్టర్ కార్యాలయాల పీ పీ పీ ను వ్యతిరేకిస్తూ 6 7 తేదీలలో లేఖరుల పెన్ డౌన్.



**నక్కపల్లి, పెన్ సత్తా, జులై 03:** రిజిస్టర్ కార్యాలయాల ప్రైవేటీకరణ ను వ్యతిరేకిస్తూ ఈనెల 6 7 తేదీలలో రెండు రోజులపాటు పెన్ డౌన్ నిర్వహిస్తున్నట్టు దస్తావేజు లేకర్ల సంఘ సభ్యులు తెలిపారు. శుక్రవారం నక్కపల్లి సబ్ రిజిస్టర్ ఆఫీస్ పరిధిలో దస్తావేజు లేఖరులు పెన్ డౌన్ కార్యక్రమం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు కొంగర జన కృష్ణమూర్తి, అధ్యక్షులు దాతారం మురళీకృష్ణ మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ కార్యాలయాలు ప్రైవేట్ పరం చేసే దిశగా ప్రభుత్వం వారు జారీ చేసిన జీవో నెంబర్ 396, వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేటుపరం చేయడం వల్ల దస్తావేజు లేఖర్ల వృత్తి భద్రతతో పాటు , ప్రజల నమ్మకాన్ని కూడా కోల్పోవలసి వస్తుందని తక్షణం జీవో నెంబర్ 396 ను నిలుపుదల చేసి యధావిధిగా రిజిస్ట్రేషన్ జరిగేటట్లు చూడాలని రాష్ట్ర సంఘ నాయకుల పిలుపుమేరకు సోమ, మంగళవారాల్లో పెన్ డౌన్ కార్యక్రమాన్ని తలపెట్టినట్లు తెలియజేశారు. క్రయ, విక్రయదారులు వివిధ పనుల మీద వచ్చే వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.

## పెళ్లి వేడుకలో 5 లక్షలు చోరీ: 3 గంటల్లోనే కేసు ఛేదించిన నాతవరం పోలీసులు.

**5 లక్షల నగదు, బంగారం రికవరీ నిందితుడి అరెస్టు.**

**నర్సీపట్నం పెన్ సత్తా, జులై 03:** రూరల్ నాతవరం మండలం లో వివాహ వేడుకలో జరిగిన దొంగతనాన్ని నాతవరం పోలీసులు అత్యంత వేగంగా, కేవలం మూడు గంటల వ్యవధిలోనే ఛేదించారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు శుక్రవారం నర్సీపట్నం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు.?ఘటన వివరాలు

నాతవరం మండలం శృంగపరం గ్రామానికి చెందిన పైలా నాయుడు కుమారుడి వివాహం గురువారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ వేడుకకు హాజరైన వధువు బంధువు సుర్ల రమణమ్మ, వివాహ ఖర్చుల కోసం సిద్ధం చేసిన రూ. 5 లక్షల నగదు, పావు తులం బంగారు కాసు, సెల్‌ఫోన్ మరియు ఒక చీరను బ్యాగులో ఉంచి తన సోదరి సూర్ల రజిని వద్ద ఉంచారు. శుక్రవారం తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో, అదే గ్రామానికి చెందిన పైలా చిట్టిబాబు (32) అక్కడికి వచ్చి రజినిని తోసివేసి, బ్యాగును లాక్కొని పరా రయ్యాడు.? బాధితులు వెంటనే 112 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించారు. దీనిపై కంట్రోల్ రూమ్ అప్రమత్తమై వేగవంత మైన దర్యాప్తుచేశారు బీట్ సిబ్బంది మహేష్ మరియు సంజీవ్‌లను సంఘటనా స్థలానికి పంపింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు రూరల్ సీఐ రేవతమ్మ, నాతవరం ఎస్ఐ వై. తారకేశ్వరరావు నేతృత్వంలో ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి గాలింపు చేపట్టాయి. గ్రామ శివారులో నిందితుడు చిట్టిబాబును అదుపులోకి తీసుకుని, చోరీకి గురైన సొత్తును పూర్తిగా స్వాధీనం చేసుకున్నారు.

?తాగుడుకు బానిసైన

నిందితుడు పైలా చిట్టిబాబు డెక్కన్ కెమికల్స్ ఫ్యాక్టరీలో ప్రొడక్షన్ విభాగంలో పనిచేస్తున్నాడని, నెలకు రూ. 30 వేల జీతం తీసుకుంటున్నాడని పోలీసులు తెలిపారు. మంచి చదువు, ఉద్యోగం ఉన్నప్పటికీ, తాగుడుకు బానిస కావడమే ఈ నేరానికి దారితీసిందని పేర్కొన్నారు.?బాధితులు సకాలంలో స్పందించి 112కు సమాచారం అందించడం వల్లే నిందితుడిని త్వరగా పట్టుకోవడం సాధ్యమైందని డీఎస్పీ అభినందించారు. ఏదైనా నేరం జరిగినప్పుడు ప్రజలు భయపడకుండా వెంటనే 112కు ఫిర్యాదు చేస్తే పోలీసులు త్వరితగతిన స్పందించి నిందితులను పట్టుకుంటారని ప్రజలకు భరోసా ఇచ్చారు. ఈ కేసును వేగంగా ఛేదించిన రూరల్ సీఐ రేవతమ్మ, ఎస్ఐ వై. తారకేశ్వరరావు మరియు బీట్ సిబ్బందిని ఆయన అభినందించారు.

## భూ సమస్యలు, రెవెన్యూ వివాదాల పరిష్కారం పై అధికారులు శ్రద్ధ పెట్టాలి.

- ఫిర్యాదులు (పిజిఆర్ఎస్) ఇవ్వడానికి సోమవారం కలెక్టర్ ఆఫీస్ కి రావలసిన అవసరము లేదు.
- మండల స్థాయి లోనే పరిష్కరించవచ్చు
- జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్.













**మాడుగుల, పెన్ సత్తా, జూలై 03:**

మాడుగుల నియోజకవర్గం పరిధి లోని భూ సమస్యలు, రెవెన్యూ వివాదాల పరిష్కారం పై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, ప్రజల నుంచి వచ్చిన అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ స్పష్టం చేశారు. శుక్రవారం ఉదయం మాడుగుల నియోజకవర్గం, మాడుగుల మండలం, పంచాయతీ రాజ్ గెస్ట్ హౌస్ మాడుగుల లో ఒక నెల- ఒక నియోజక వర్గం- నాలుగు సందర్శనలు కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్, మాడుగుల శాసనసభ్యులు బండారు సత్యనారాయణ మూర్తి తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విజయ క్రిష్ణన్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను శీఘ్రగతిన పరిష్కారం, రెవెన్యూ శాఖలో పారదర్శకతను పెంచడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నూతన కార్యక్రమం ఒక నెల -- ఒక నియోజకవర్గం --నాలుగు సందర్శనలు కార్యక్రమాన్ని జిల్లాలో ఇక్కడ నిర్వహించడం జరిగిందన్నారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు స్పష్టం చేశారు. రీ-సర్వే ప్రక్రియలో ప్రధానంగా రెండు రకాల ఫిర్యాదులు వస్తున్నాయని, మొదటిది విస్తీర్ణం తగ్గడం, రెండవది ఒకరి పేరుకు బదులు మరొకరి పేరు నమోదు కావడం. ఇటువంటి తప్పులు పునరావృతం కాకుండా చూడాలని స్పష్టం చేశారు. ల్యాండ్ రికార్డులను ప్రాపర్ గా వెరి ఫై ప్యూరి ఫై చేసిన తర్వాతే రికార్డులను భద్రపరచాలన్నారు. భూమి వద్దకు వెళ్లి అక్కడ ఎవరు ఉంటే వారి పేర్లు నమోదు చేయడం సరైన పద్ధతి కాదని కలెక్టర్ తెలిపారు.

విలేజ్ సర్వేయర్లు, వి.ఆర్.ఓ లు రేపే క్షేత్రస్థాయికి వెళ్లి, విస్తీర్ణం హెచ్చుతగ్గులు మరియు పేర్ల మార్పిడికి సంబంధించిన సమస్యలను పరిశీలించి, వచ్చే బుధవారం నాటికి పూర్తి స్పష్టత ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ బాధ్యతను మండల స్పెషల్ ఆఫీసర్లు, ఎ.డి సర్వే పర్యవేక్షించాలని ఆదేశించారు. అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల అప్రూవల్ ఇచ్చినప్పటికీ, ల్యాండ్ చూపించడంలో వి.ఆర్.ఓ లు నిర్లక్ష్యం వహించడం పై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో ఎంత స్థలం ఖాళీగా ఉంది, ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారు, అందులో ఎంతమంది అర్హులు అనే వివరాలు అధికారులకు స్పష్టంగా తెలుసుకొని, సప్లై డిమాండ్‌ను మ్యాచ్ చేసి వచ్చే వారం నాటికి లబ్ధిదారులకు స్థలాలను చూపించి సమస్యను పరిష్కరించాలని, తదుపరి సమీక్ష నాటికి ఈ కేటగిరీ ఫిర్యాదులు రాకూడదని స్పష్టం చేశారు.

జల్ జీవన్ మిషన్ (జేజేఎం) కి సంబంధించిన ఫిర్యాదుల పై ఆర్.డబ్ల్యూ.ఎస్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, సంబంధిత ఏ.ఈ లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు క్షేత్రస్థాయికి వెళ్లి సమస్యలను క్షుణ్ణంగా అర్థం చేసుకుని, వాటిని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఎస్.జి.ఎస్ కు సంబంధించిన దరఖాస్తులను కేవలం కన్వర్ట్ చేయడం మాత్రమే కాకుండా, వాటిని త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజల నుండి వచ్చే గ్రీవెన్స్‌లను నిర్లక్ష్యం చేయకుండా నిర్ణీత గడువులోగా పరిష్కరించి, ప్రజలకు మేలు చేకూరేలా ప్రతి ఒక్క అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని కలెక్టర్ హెచ్చరించారు. వచ్చే వారం నాటికి పెండింగ్‌లో ఉన్న అన్ని సర్వీస్ డెలివరీలు పూర్తి కావాలని, ఈ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని (మానిటర్ చేయాలని) సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా సిసి రోడ్ల కొరకు అనేక అభ్యర్థనలు వస్తున్నాయి. వీటన్నింటికీ తక్షణమే ఎస్టిమేషన్లు సిద్ధం చేయాలని సీఈఓ జెడ్పీకి సూచించారు. నిధుల లభ్యతను బట్టి మండల పరిషత్ నిధులు లేదా డ్వామా నిధుల ద్వారా వచ్చే వారం లోపల ఎన్ని పనులకు అనుమతులు (సాంక్షన్స్) ఇవ్వగలమో చూసి ఈ కేటగిరీని క్లోజ్ చేయాలని కలెక్టర్ తెలిపారు. సరైన పత్రాలు (డాక్యుమెంట్లు) ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో తలెత్తుతున్న భూ వివాదాల సమస్యలపై కలెక్టర్ ప్రత్యేకంగా స్పందించారు. మండల స్థాయిలో జరిగే కో ఆర్డినేషన్ కమిటీ (ఎంఎల్సిసి) సమావేశాలలో పోలీస్ అధికారులు, రెవెన్యూ అధికారులు ఇరువర్గాలను కూర్చోబెట్టి మాట్లాడాలని చెప్పారు. చట్టపరంగా సాధ్యమయ్యే పరిష్కారాలను వారికి స్పష్టంగా వివరించాలని, ఒకవేళ తమ పరిష్కారం నచ్చకపోతే సివిల్ కోర్టును ఆశ్రయించి ఆర్డర్ తెచ్చుకోమని క్లారిటీగా చెప్పాలన్నారు. ప్రజా సమస్యల వేదికకు ప్రజలు ఇంత పెద్ద సంఖ్యలో రావడానికి ప్రధాన కారణం, క్షేత్రస్థాయిలో అధికారులు వారికి సమస్యల పైన సరైన అవగాహన కల్పించక పోవడమేనని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. మండల, గ్రామ స్థాయి అధికారులు ప్రజలతో సరిగ్గా మాట్లాడి, సమస్యకు గల కారణాలను వివరిస్తే 90% సమస్యలు అక్కడే పరిష్కారమవుతాయని స్పష్టం చేశారు. వచ్చే వారం సమీక్షా సమయానికి, ఈ వారం అందిన దరఖాస్తులలో ఎన్ని పరిష్కరించ బడ్డాయి, ఎన్ని ప్రక్రియలో (ఇన్-ప్రోసెస్) ఉన్నాయి మరియు వేటిని చట్టపరంగా చేయలేము అనే పూర్తి వివరాలతో కూడిన క్లారిటీ అధికారుల వద్ద, దరఖాస్తుదారుల వద్ద ఉండాలని ఆదేశించారు. మ్యుటేషన్ వంటి సేవలకు 21 రోజుల సమయం పడుతుంది కాబట్టి, ఆయా కాలపరిమితిని దరఖాస్తుదారునికి వివరించాలన్నారు.

ప్రభుత్వ సేవలు, సమస్యల పరిష్కారం పై ప్రజల్లో సానుకూల దృక్పథం (పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్) కల్పించడమే లక్ష్యంగా ప్రతి అధికారి పనిచేయాలని, వచ్చే వారం జరిగే సమావేశంలో మొదటి 30 నిమిషాలు ఈ వారం ఇచ్చిన ఆదేశాల ప్రగతి పైనే సమీక్ష (రివ్యూ) ఉంటుందని కలెక్టర్ హెచ్చరించారు.

వచ్చే శుక్రవారం నాటికి ప్రతి ఒక్క అధికారి తమ శాఖకు సంబంధించిన దరఖాస్తులపై పూర్తి స్పష్టతతో ఉండాలి. గతంలో అందిన పిటిషన్లు ఎన్ని?, వాటిలో పరిష్కరించినవి ఎన్ని?, ప్రస్తుతం ప్రక్రియలో ఉన్నవి ఎన్ని?, తిరస్కరించినవి ఎన్ని?, వాటిని ఎందుకు చేయలేకపోయాము? అనే పూర్తి వివరాలతో కూడిన రిపోర్టును సిద్ధం చేయాలన్నారు. ఒకవేళ క్షేత్రస్థాయిలో సమస్య పరిష్కారం కాకపోతే, ఆ వివరాలను జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకువస్తే, తదుపరి మార్గదర్శకాలను అందించడం జరుగుతుందని తెలిపారు. మండల, జిల్లా స్థాయిలో అందిన అన్ని రకాల దరఖాస్తులను (భౌతికంగా లేదా కంప్యూటరైజ్డ్ విధానంలో వచ్చినవి) సేకరించి, సంబంధిత శాఖలకు పంపడం జరుగుతుందని అధికారులు తెలిపారు. అయితే, గతంలో మ్యాన్యువల్‌గా రశీదులు ఇచ్చి ఉన్న దరఖాస్తులను వెంటనే స్కాన్ చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. దీనివల్ల అప్లికేషన్లను ట్రాక్ చేయడం సులువవుతుందని, ఈ బాధ్యతను కౌంటర్ సిబ్బంది, మండల అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. ఏదో ఒక సమాధానం చెప్పి దరఖాస్తులను ముగించడం కాకుండా, సమస్యలను శాశ్వతంగా, చట్ట బద్ధంగా పరిష్కరించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని, అధికారులు దీనిని గమనించి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ తెలిపారు.

మాడుగుల శాసనసభ్యులు బండారు సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ ఈ నియోజకవర్గంలో వెనుకబడిన తరగతుల వారే ఎక్కువ మంది ఉన్నారని, ఇంత పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసి, నిర్వహిస్తున్న ఈ పి జి ఆర్ ఎస్ కార్యక్రమం ద్వారా ప్రజలు ఆశించిన ఫలితాలు అందాలని, ఈ ప్రభుత్వము ప్రజలకు ఇచ్చిన మాట కట్టుబడి ఉందని అలాగే వి.ఆర్.ఓ, విలేజ్ సర్వేయర్లు, ఆర్.డబ్ల్యూ.ఎస్, పెన్షన్స్, ఎస్.జి.ఎస్ విభాగాలతో పాటు మండల టీములను కోరారు. ఈ జిల్లాలో రెండవ సారిగా ఈ నియోజకవర్గానికి సంబంధించి ఒక నెలలో నాలుగు సార్లు (వారానికి ఒకసారి చొప్పున) ఈ విధమైన సమీక్షా సమావేశాలు నిర్వహించడం జరుగుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శౌర్య మాన్ పటేల్ ఇంచార్జి డి ఆర్ ఓ వై. శ్రీనివాసరావు ఆర్డీవోలు ఆయిషా, వి.వి రమణ లు, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో హాజరైనారు.

## పెళ్లి మండపంలో రూ.5.60 లక్షల దొంగతనాన్ని 3 గంటల్లోనే ఛేదించిన పోలీసులు.

- 112 కాల్‌తో క్షణాల్లో కదిలిన యంత్రాంగం:
- పూర్తి సొత్తు రికవరీ..నిందితుడి అరెస్ట్.
- సిబ్బందికి ఎస్పీ తుహిన్ సిన్హా, డీఎస్పీ పోతిరెడ్డి శ్రీనివాసరావు అభినందనలు.





**నాతవరం, పెన్ సత్తా, జులై 03:** వివాహ వేడుకలో జరిగిన ఒక భారీ దోపిడీ కేసును నాతవరం పోలీసులు అత్యంత చాకచక్యంగా కేవలం మూడు గంటల వ్యవధి లోనే ఛేదించి, నిందితుడిని అరెస్ట్ చేయడంతో పాటు రూ.5,60,000/- విలువైన పూర్తి సొత్తును రికవరీ చేశారు. బాధితులు సకాలంలో 112 అత్యవసర నంబర్‌కు ఫోన్ చేయడం వల్లే ఈ కేసు ఇంత వేగంగా కొలిక్కి వచ్చిందని పోలీసులు తెలిపారు. ?కేసు వివరాలు ఇలా నాతవరం పోలీస్ స్టేషన్ పరిధి లోని శృంగవరం గ్రామానికి చెందిన పైలా నాయుడు కుమారుడి వివాహ వేడుక గురువారం (02-07-2026) రాత్రి జరిగింది. వధువు తరపు వారైన సూర్ల రమణమ్మ వివాహ ఖర్చుల నిమిత్తం సిద్ధం చేసుకున్న రూ.5,00,000/- నగదు, పావు తులం బంగారు కాసు, ఒక సెల్‌ఫోన్, ఒక చీరను ఒక బ్యాగులో ఉంచారు. పెళ్లి మండపం సమీపంలో రాత్రి సుమారు 03:30 గంటల సమయంలో ఆ బ్యాగును రమణమ్మ అక్క అయిన సూర్ల రజిని పట్టుకుని కూర్చుని ఉన్నారు. అదే సమయంలో అదే గ్రామానికి చెందిన పైలా చిట్టిబాబు (తండ్రి: అక్కునాయుడు, వయస్సు 32 ఏళ్ళు, ప్రైవేట్ ఉద్యోగి) అనే వ్యక్తి ఒక్కసారిగా పరుగున వచ్చి, పెళ్లి మండపం వద్ద కూర్చుని ఉన్న రజినిని బలవంతంగా నెట్టివేసి, ఆమె చేతిలో ఉన్న బ్యాగును లాక్కొని చీకట్లోకి పారిపోయాడు. వెంటనే 112 కాల్ చేయడంతో కేసును మలుపు తిప్పిన సత్వర స్పందన: బ్యాగు పోయిన వెంటనే బాధితురాలు సూర్ల రజిని ఏమాత్రం ఆలస్యం చేయకుండా తక్షణమే '112' (అత్యవసర సహాయక నంబర్) కు కాల్ చేశారు. ఈ కాల్ ఆధారంగా కంట్రోల్ రూమ్ అలర్ట్ అవ్వడంతో, నాతవరం పోలీస్ స్టేషన్ బీట్ సిబ్బంది అయిన పిసి మహేష్, హెచ్‌సి సంజీవ్‌లు నిమిషాల వ్యవధిలో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వారు వెంటనే క్షేత్రస్థాయి పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. బాధితులు 112 కి కాల్ చేయడం, బీట్ సిబ్బంది తక్షణమే స్పందించడం ఈ కేసును కేవలం 3 గంటల్లో ఛేదించడానికి ముఖ్య కారణమైంది. ??శుక్రవారం ఉదయం బాధితురాలు నాతవరం పోలీస్ స్టేషన్‌లో అధికారికంగా ఫిర్యాదు చేయగా, క్రైమ్ నెం.62/2026 కింద కేసు నమోదైంది. నర్సీపట్నం సబ్ డివిజన్ డీఎస్పీ పోతిరెడ్డి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు రూరల్ సీఐ రేవతమ్మ, నాతవరం ఎస్ఐ శ్రీ వై.తారకేశ్వరరావు తమ సిబ్బందితో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నిందితుడి కోసం గాలింపు చేపట్టారు.

?గ్రామ శివారుల్లో నిందితుడు ఉన్నాడనే పక్కా సమాచారంతో, పోలీసులు మధ్యవర్తుల సమక్షంలో పైలా చిట్టిబాబును అదుపు లోకి తీసుకున్నారు. అతని వద్ద ఉన్న బ్యాగును తనిఖీ చేయగా.. దొంగిలించబడిన రూ. 5,00,000 నగదు (రూ.50,000 చొప్పున 10 కట్టలు), పావు తులం బంగారు కాసు, సెల్‌ఫోన్, చీర సురక్షితంగా లభ్యమయ్యాయి. వీటి మొత్తం విలువ సుమారు రూ. 5,60,000/- గా పోలీసులు నిర్ధారించి, స్వాధీనం చేసుకున్నారు. ?అపరాధ జోన్ లోకి వెళ్లిన కేసును సాంకేతికత, వేగవంత మైన దర్యాప్తుతో కేవలం 3 గంటల్లోనే ముగించి, నూతన వధూవరుల కుటుంబంలో సంతోషం నింపిన నాతవరం ఎస్ఐ వై. తారకేశ్వర రావు ను, రూరల్ సీఐ రేవతమ్మ, బీట్ సిబ్బందిని, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, నర్సీపట్నం డీఎస్పీ పోతిరెడ్డి శ్రీనివాసరావు ప్రత్యేకంగా అభినందించారు. ?ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ..నేర సంఘటనలు, దొంగతనాలు లేదా ఎలాంటి అత్యవసర పరిస్థితులు ఎదురైనా ప్రజలు భయపడకుండా వెంటనే 112 నంబర్‌కు సమాచారం అందించాలి. ఈ కేసులో బాధితులు 112ని సకాలంలో వాడుకోవడం వల్లే పోలీసులు ఇంత వేగంగా స్పందించి రికవరీ చేయగలిగారు. టెక్నాలజీని, పోలీసు సేవలను ప్రజలు ఇలాగే సద్వినియోగం చేసుకోవాలి అని కోరారు.

# పోలీసు పిల్లల ప్రతిభను ప్రోత్సహిస్తూ స్కాలర్షిప్ లు, ప్రశంసా పత్రాలు అందజేసిన ఎస్పీ.

## విధి నిర్వహణలో మరణించిన సిబ్బంది కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేత.






**అనకాపల్లి, పెన్ సత్తా, జూలై 03:** పోలీసు కుటుంబాల పిల్లలను ఉన్నత విద్యలో ప్రోత్సహిస్తూ, వారికి భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో ఎదగడానికి ప్రేరణనిస్తూ జిల్లా పోలీస్ అసోసియేషన్ అడహాక్ కమిటీ ఆధ్వర్యంలో ప్రతిభ గల విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, నగదు బహుమతులు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా చేతుల మీదుగా అందజేయడం జరిగింది. 2025-26 విద్యాసంవత్సరం లో 10 వ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన 29 మంది పోలీసు కుటుంబాల విద్యార్థులకు రూ.1.52 లక్షల విలువైన స్కాలర్షిప్‌లను జిల్లా ఎస్పీ అనకాపల్లి పట్టణం, పోలీస్ గెస్ట్ హౌస్ లో జరిగిన కార్యక్రమంలో అందజేశారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులతో మమేకమై, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కృషి చేస్తే విజయాలను సాధించడం సులభమని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది సంక్షేమంలో భాగంగా, వారి పిల్లలు ఉన్నత విద్యలో ముందుకు వెళ్లాలని, మంచి ర్యాంకులు సాధించి భవిష్యత్తులో స్థిరపడాలని కోరుకుంటున్నాం. ఈ కార్యక్రమంలో ప్రతి విద్యార్థిలో కొత్త స్ఫూర్తిని నింపుతుంది. అని తెలిపారు. విద్యార్థులతో జిల్లా ఎస్పీ శ్రద్ధగా వారు సాధించిన మార్కులు, ప్రస్తుత చదువులు, భవిష్యత్తు లక్ష్యాలు తెలుసుకొని వారికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. విద్యార్థుల ఉత్సాహాన్ని పరిశీలించిన ఎస్పీ, వారికి సాధ్యమైనంత సహాయం అందించేందుకు జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. మరణించిన సిబ్బంది కుటుంబాలకు ఆర్థిక భరోసా: అనంతరం జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో విధినిర్వహణలో మరణించిన ఐదుగురు పోలీస్ సిబ్బంది కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రూ.50,000/- చొప్పున నగదు చెక్ లను అదనపు ఎస్పీ ఎల్.మోహన రావు అందజేశారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ ఆయా కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ.. వారి వివరాలు, పోలీస్ శాఖ తరపున రావలసిన ఆర్థికపరమైన ప్రయోజనాలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు. అలాగే వారికి కారుణ్య నియామకాలకు సంబంధించి జిల్లా కలెక్టర్ తో మాట్లాడి త్వరితగతిన జరిగే విధంగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఎటువంటి సమస్యలు ఉన్నా తక్షణమే సహాయపడేందుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని కుటుంబ సభ్యులకు తెలిపి వారిని ఓదార్చారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు జీ.ఆర్.ఆర్.మోహన్, కె.రవికుమార్, ఇన్స్పెక్టర్లు లక్ష్మి, వెంకట్ నారాయణ, గఫూర్, ప్రేమ కుమార్ ఇతర పోలీస్ అధికారులు, పోలీస్ అసోసియేషన్ అడహాక్ అధ్యక్షులు సిసిఎస్ ఇన్స్పెక్టర్ అప్పలనాయుడు, ట్రెజరర్ లలిత, సభ్యులు అచ్చయ్య, భూలోక, సత్యనారాయణ, మల్లీశ్వరి, శేషాద్రి, రాష్ట్ర పోలీస్ అధికారుల సంఘం సభ్యుడు ఎస్ఐ శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.






# ప్రపంచ టు వీలర్ మెకానిక్ దినోత్సవం.

- ఇచ్ఛాపురం నియోజకవర్గ టూవీలర్ మెకానిక్స్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు. విశేష స్పందన







**సోంపేట పెన్ సత్తా, జూలై 03::**ప్రపంచ టు వీలర్ మెకానిక్ దినోత్సవం పురస్కరించుకొని ఇచ్ఛాపురం నియోజకవర్గ టూవీలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సోంపేట పట్టణంలో సేవా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసి మెకానిక్స్ తమ సామాజిక బాధ్యతను చాటుకున్నారు. ఈ కార్యక్రమానికి ఇచ్ఛాపురం జనసేన ఇన్చార్జ్ దాసరి.రాజు ప్రారంభోత్సవం చేయగా,ముఖ్యఅతిథిగా వైఎస్ఆర్సిపి ఇంచార్జ్ సాడి.శ్యాం ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.శ్యాంప్రసాద్ మాట్లాడుతూ సమాజానికి మెకానిక్స్ చేస్తున్న సేవలు అమూల్యమని ఈ రక్తదాన శిబిరము మరియు వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ మెగా వైద్య శిబిరంలో 240మంది ఉచితంగా వైద్య పరీక్షలు చేయించుకోగ, 23మంది రక్తదానం చేశారు.ఈ మెగా వైద్య శిబిరంలో పట్టణ ప్రముఖులు మరియు నాయకులు జేమ్స్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# గుర్తు తెలియని పదార్థం పేలి మహిళ ఉపాధి కూలీకి గాయాలు.

- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పరవాడ పోలీసులు.



**పరవాడ పెన్ సత్తా, జూలై 03:**అనకాపల్లి జిల్లా,పరవాడ మండలం, స్వయంభువరం గ్రామంలో వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజుగార్ అజీవికా మిషన్ - గ్రామీణ్ ఉపాధి పనుల్లో విషాదం చోటుచేసుకుంది. శుక్రవారం స్థానిక రామ్ సాగర్ చెరువులో సుమారు 55 మంది కూలీలు పనులు చేస్తుండగా తుంపాల లక్ష్మి అప్పల నరసమ్మ ( 46) అనే మహిళ పూడిక మట్టిని పారతో త్రవ్వగా గుర్తుతెలియని పదార్థం తేలింది. ఈ ప్రమాదంలో

ఆమె కళ్ళకు తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే ఆమెను శంకర్ ఫౌండేషన్ నేత్రాలయ ఆసుపత్రికి తరలించగా కుడి కన్ను తీవ్ర గాయాలు అయ్యాయని వైద్యులు నిర్ధారించారు. ఎడమ కన్ను కి ఆపరేషన్ చేయాలి అని చెప్పారు. గుర్తుతెలియని వ్యక్తులు చాలా కాలం క్రితం పందులు కోసం ఇది పెట్టి ఉండవచ్చని భావిస్తున్నారు. ఈ సంఘటనపై పరవాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# నాసిరకం విత్తనాలను పంపిణీ చేసిన ఈ కూటమి ప్రభుత్వం మూల్యం చెల్లించుకోక తప్పదు.

ఎమ్మెల్సీ నర్తు. రామారావు



**కవిటి పెన్ సత్తా, జూలై 03::**ఇచ్ఛాపురం నియోజకవర్గం లో ఇటీవల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కవిటి,కంచిలి, సోంపేట మండలాలరైతులకు పంపిణీ చేసిన ఆర్‌జీఎల్ (2537)వరి విత్తనాలు నారుమడిలో వేసి 15 రోజులు గడిచినా మొలకెత్తకపోవడం అత్యంత ఆందోళనకరమైన విషయం అని ఎమ్మెల్సీ రామారావు పేర్కొన్నారు.శుక్రవారం ఆయన క్యాంప్ కార్యాలయంలో పత్రికా సమావేశం నిర్వహించి కూటమి ప్రభుత్వం ఘాటుగా మండిపడ్డారు.కవిటి మండలంలోని బొరివంక, డీజీ పుట్టుగ,కపాసకుద్ది, పుటియదల,డొంకూరు, ఈదుపురం,ధర్మపురం గ్రామాల రైతులు ఈ సమస్యను నా దృష్టికి తీసుకువచ్చారని ఎమ్మెల్సీ పేర్కొన్నారు.వ్యవసాయ సీజన్ ప్రారంభంలోనే రైతులకు ఇలాంటి పరిస్థితి ఎదురుకావడం అత్యంత బాధాకరం.ఇప్పటికే కొబ్బరి, జీడి, మామిడి పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారు.ఇలాంటి సమయంలో ప్రభుత్వం అందించిన వరి విత్తనాలే మొలకెత్తకపోవడంతో రైతులు పూర్తిగా నిరాశలోకి వెళ్లిపోయారు.ఇది రైతుల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపుతోంది.ప్రభుత్వం వెంటనే స్పందించి, వ్యవసాయ శాఖ ద్వారా క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి,మొలకెత్తని విత్తనాల స్థానంలో నాణ్యమైన విత్తనాలను ఉచితంగా అందించాలని,నష్టపోయిన రైతులకు తగిన పరిహారం ప్రకటించి ఆదుకోవాలి. లేని పక్షంలో ఈ కూటమి ప్రభుత్వం భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.రైతులను ఇబ్బందులకు గురిచేసిన విత్తనాల నాణ్యతపై పూర్తి స్థాయి విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి అని పేర్కొన్నారు.ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు న్యాయం చేయకపోతే, రైతుల పక్షాన వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో గ్రామస్థాయి నుంచి ఉద్యమాలు చేపట్టి రైతుల హక్కుల కోసం పోరాటం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నామని చెప్పారు.

# దక్షిణ ఎనర్జీ కంపెనీ నిర్వాకం.





- పూర్తిస్థాయి అనుమతులు లేకుండానే కంపెనీ నిర్వహణ.
- మృతుల కుటుంబాలకు అన్యాయం.
- తూతూ మంత్రంగా పరిహారం పంపిణీ.
- ప్రమాదంపై సమగ్ర విచారణ చేయాలి.
- ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు గని శెట్టి డిమాండ్.

**పరవాడ పెన్ సత్తా, జూలై 03:** మండలంలో జవహర్లాల్ నెహ్రూ ఫార్మా సిటీని ఆనుకొని ఇండస్ట్రియల్ పార్క్ ఫేస్ 3 లో గల దక్షిణ ఎనర్జీ కంపెనీ పూర్తిస్థాయి అనుమతులు తీసుకోకుండానే ఉత్పత్తిని ప్రారంభించింది. గత నెల 23న జరిగిన ప్రమాదంలో ఇద్దరు కార్మికులుమృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై అధికారులు తనిఖీలు నిర్వహించగా కంపెనీ యాజమాన్యం నిర్వాకం బయటపడింది. కనీసం వసతులు గాని, కనీసం కార్మికులకు భీమా, పీఎఫ్ బంటి సౌకర్యాలు లేకుండానే కంపెనీ నిర్వహించడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే ఇద్దరూ కార్మికులు మృతి చెందినట్లు నివేదికలో తేలింది. దీనికి తోడు మృతుల కుటుంబాలకు తూతూ మంత్రంగా పరిహారం చెల్లించి చేతులు దులుపుకున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఘటనపై ఫార్మసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ దక్షిణ ఎనర్జీ కంపెనీపై సమగ్ర విచారణ చేయాలని డిమాండ్ చేశారు. దక్షిణ ఎనర్జీ యాజమాన్యం కార్మికులతో 24 గంటల పాటు పనిచేస్తూ నిబంధనలను తుంగలో తొక్కారన్నారు. ఈఎస్ఐ, పిఎఫ్ లేకపోవడం హాజరు పట్టిక నిర్వహించకపోవడం భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వంటి అంశాలపై సమగ్ర విచారణ చేసి యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని గనిశెట్టి డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇట్లాంటి ప్రమాదాలు జరగకుండా భద్రత ఆడిట్ నిర్వహించాలని ఇండస్ట్రియల్ పార్కులో కార్మిక శాఖ, ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు నిత్యం పర్యవేక్షించాలని గని శెట్టి డిమాండ్ చేశారు. కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని ఏ విధమైన చట్టాలు అమలు చేయడం లేదని మండిపడ్డారు. ఇండస్ట్రియల్ పార్కులో వందలాది మంది వలస కార్మికులను తీసుకొచ్చి 24 గంటలు పనులు చేయించి ఈ ప్రమాదాలకి కారణం అవుతున్నారని అన్నారు. యాజమాన్యాలు లాభాలే పరమార్ధం ఎవరు ఇస్తున్నారు తప్ప కార్మికుల రక్షణ భద్రత సంక్షేమాన్ని గాలికి వదిలేస్తున్నారని అన్నారు. కాగా

ఈ ప్రమాదంపై ప్రజా సంఘాలు, జర్నలిస్టు సంఘాలు, కార్మిక సంఘాలు సంయుక్తంగా

జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదు చేయడనికి రంగం సిద్ధం చేశారు.





# సాయికృష్ణ మిస్టరీపై 'మెజిస్టీరియల్' విచారణ.. సర్కారు సంచలన నిర్ణయం!



విజయవాడ కృష్ణలంకకు చెందిన గాదే సాయికృష్ణ(28) మిస్సింగ్ వ్యవహారం మిస్టరీగా మారిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారం తీవ్రస్థాయిలో కుదిపివేస్తోంది. ఈ నెల 15న హైకోర్టు పూర్తిస్థాయిలో దీనిని విచా రించేందుకు రెడీ అయింది. ఈ నేపథ్యంలో సర్కారు తనవంతుగా.. ఈ ఘటనపై చర్యలను తీవ్రతరం చేసింది. ఇప్పటికే ఈ వ్యవహారంపై ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసి ఆరోపణలు ఎదుర్కొంటు న్న సీఐ నాగరాజును అరెస్టు చేసి రాజమండ్రి సెంట్రల్ జైలుకు పంపించింది.

అయినప్పటికీ.. సాయికృష్ణ కేసులో ఇంకా తీగ కదిలినా.. డొంక కదల్లేదు. ప్రభుత్వం కేసు నమోదు చేసి.. దాదాపు 15 రోజులు గడిచిపోతున్నా ఇంకా సాయికృష్ణ ఆచూకీ కానీ, ఆయన గురించి తదుపరి వివరాలు కానీ.. సేకరించలేక పోయారు. మరోవైపు ఒక సీఐ, ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, మరో ఇద్దరు కానిస్టేబుళ్లను ప్రత్యకదర్యాప్తు బృందం అధికారులు అరెస్టు చేశారు. అయినప్పటికీ.. కేసు మూలాలను మాత్రం ఛేదించలేక పోయారు. ఈ పరిణామాలు ఇలా ఉంటే.. మరోవైపు హైకోర్టు, ఇంకోవైపు జాతీయ మానవ హక్కుల సంఘం కూడా సాయికృష్ణ కేసును తీవ్రంగా భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సర్కారు సంచలన నిర్ణయం తీసుకుంది. రాష్ట్రం ఏర్పడిన తర్వాత.. అంటే.. దాదాపు పుష్కరకాలంలో ఫస్ట్ టైమ్.. ఓ కేసు విషయంలో –మెజిస్టీరి యల్– విచారణకు ఆదేశించింది. ఈ మేరకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 4(శనివారం) ఉదయం 11 గంటల నుంచి ఈ విచారణ జరుగుతుందన్నారు.

**ఏం చేస్తారు?**

మెజిస్టీరియల్ విచారణ అంటే.. పోలీసులతో సంబంధం లేకుండా.. జిల్లా మెజిస్ట్రేట్ హోదాలో కలెక్టర్ లేదా సబ్ కలెక్టర్(సబ్ మెజిస్ట్రేట్ హోదా) విచారణ చేస్తారు. ఈ సమయంలో ఎవరైనా.. ఎక్కడివారైనా సాయికృష్ణకు సంబంధించిన సమాచారాన్ని... ఈ కేసులో తమకు తెలిసిన అంశాలను నిర్భయంగా వెల్లడించేందుకు అవకాశం ఇస్తారు. ఈ వివరాలను సబ్ కలెక్టర్ అధికారికంగా పిన్ టు పిన్ నమోదు చేసి .. ప్రభుత్వానికి, అదేసమయంలో సంబంధిత కోర్టుకు కూడా పంపిస్తారు.

**ఏం జరుగుతుంది?**

ఏదైనా కేసులో తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు.. ప్రభుత్వాలు ఇలా మెజిస్టీరియల్ విచారణకు ఆదేశిస్తారు. తద్వారా.. బాధితులకు కొంత మేరకు ఉపశమనం లభిస్తుంది. అదేసమయంలో హైకోర్టులు సహా.. ఇతర ప్రజాసంఘాల నుంచి ఎదురయ్యే ప్రశ్నలకు కూడా సమాధానం లభిస్తుంది. అత్యంత అరుదైన కేసుల్లో మాత్రమే ఇలాంటి విచారణలు జరుగుతాయి. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో ఇదే విజయవాడలో ఓ ఎస్సీ మహిళ కృష్ణ కుమారి లాకప్ డెత్‌కు గురైనప్పుడు మెజిస్టీరియల్ విచారణకు ఆదేశించారు.

## అమెరికాలో భారతీయులపై మరోసారి విద్వేషం.. హిందూ ఆలయం ఎదుట రెచ్చిపోయిన మాగా కార్యకర్త



మేక్ అమెరికా గ్రేట్ అగైన్ అంటూ తిరిగే కొందరు మేధావులకి ఈ మధ్య పాపం నిద్రపట్టడం లేదు. డొనాల్డ్ ట్రంప్ గారు వైట్ హౌస్‌లో అడుగుపెట్టారో లేదో.. వీరికి ఎక్కడలేని ఉత్సాహం వచ్చేసింది. ఈ క్రమంలోనే అమెరికాలో స్థిరపడిన భారతీయులను ముఖ్యంగా హెచ్1బీ వీసాల మీద వచ్చి రాత్రింబవళ్లు కష్టపడే టెక్కీలను చూసి కొందరు తట్టుకోలేకపోతున్నారు. తాజాగా టెక్సాస్‌లోని ఫ్రిస్కోలో ఉన్న ఓ హిందూ ఆలయం సాక్షిగా ఇలాంటి విద్వేష 'కళాఖండం' ఒకటి బయటపడింది.

ఎలిజా షాఫర్ అనే ఒక సోషల్ మీడియా వీరుడు.. మగా కార్యకర్త అని చెప్పుకుంటాడు.. చేతిలో కెమెరా పట్టుకుని ఫ్రిస్కోలోని ఒక హిందూ దేవాలయం ముందుకు చేరుకున్నాడు. అక్కడ ప్రశాంతంగా ఆడుకుంటున్న చిన్న పిల్లలను చూసి ఆయనగారికి ఎక్కడో కాలిపోయింది. వెంటనే కెమెరా ఆన్ చేసి, ఆ చిన్నారులను రికార్డ్ చేస్తూ సంచలన 'ఆవిష్కరణలు' మొదలుపెట్టాడు. "నా వెనుక కనిపిస్తున్న ఈ పిల్లలంతా హెచ్1బీ వీసాదారుల పిల్లలే. వీరిని అమెరికన్లుగా పరిగణించడం ఏమాత్రం సరికాదు. వీరి తల్లిదండ్రులు అమెరికా పౌరులు కూడా కారు" అంటూ సదరు మేధావి దేశభక్తిని ఒలకబోశాడు. అమెరికాలో పుడితే చాలు పౌరసత్వం వచ్చేస్తుందని ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఈయనగారికి అస్సలు నచ్చలేదట.

**జూలై 4 వేడుకలు చేసుకోనంత కసి..**

షాఫర్ గారి ఆవేదన అంతటితో ఆగితే అది విద్వేష ప్రచారం ఎందుకవుతుంది? టెక్సాస్ వీధుల్లో భారతీయ పిల్లలు ఎక్కువగా కనిపిస్తున్నారనే బాధతో.. తాను ఈసారి జూలై 4న వచ్చే 'అమెరికా స్వాతంత్ర్య దినోత్సవాన్ని' కూడా జరుపుకోనని భీష్మించుకు కూర్చున్నాడు. అమెరికా పౌరసత్వం ఉన్న భారతీయ సంతతి పిల్లల వల్ల అమెరికా స్వాతంత్ర్య దినోత్సవానికే ముప్పు వచ్చేసిందన్నమాట.. ఇక పొలిటికల్ టచ్ ఇవ్వకుండా ఈయనగారి సోషల్ మీడియా వీడియో ఎలా పూర్తవుతుంది? అందుకే ఏకంగా అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌ను కూడా టార్గెట్ చేశాడు. జేడీ వాన్స్ భార్య ఉషా వాన్స్ భారతీయ మూలాలు ఉన్న మహిళ కావడమే ఇక్కడ ఈయనగారి అసలు సమస్య. భారతీయ భార్య ఉన్న వ్యక్తులు అమెరికా ప్రభుత్వ పదవుల్లో ఉండడాన్ని తాను అస్సలు నమ్మనని, విశ్వసించనని షాఫర్ తేల్చి చెప్పేశాడు. అంటే భార్య భారతీయురాలు అయితే భర్త అమెరికాకు నమ్మకస్తుడు కాదనే వింత లాజిక్‌ను ఈయన కనిపెట్టాడన్నమాట.

**గతంలో జెండాలు.. ఇప్పుడు గుడులు..**

ఈ షాఫర్ గారికి భారతీయులంటే ఎంత 'అభిమానమో' చెప్పడానికి ఒక ఉదాహరణ ఉంది. గతంలో టెక్సాస్‌లో భారత జెండాను చించివేసిన ఒక వివాదాస్పద ఘటనను ఈయనే సోషల్ మీడియాలో తెగ షేర్ చేసి ఆనందించాడు.

# సీఎం విజయ్-త్రిషపై అనుచిత వ్యాఖ్యలు.. ఎమ్మెల్యే అరెస్ట్





రాజకీయాల్లో మైకు దొరికితే చాలు.. ఏం మాట్లాడుతున్నామో కూడా మర్చిపోయి రెచ్చిపోవడం మన నేతలకు అలవాటే. కానీ ఆ నోటి దూల ఒక్కోసారి జైలు ఊచలు లెక్కపెట్టేలా చేస్తుందని తమిళనాడు డీఎంకే ఎమ్మెల్యే అనితా రాధాకృష్ణన్‌కు ఇప్పుడు బాగా అర్థమై ఉంటుంది. తమిళనాడు ముఖ్యమంత్రి, టీవీకే అధినేత విజయ్, అలాగే స్టార్ హీరోయిన్ త్రిషను ఉద్దేశించి ఆయన చేసిన "అతి" తెలివి కామెంట్లు.. చివరకు ఆయన్ను 'కటాకటాల' వెనక్కి నెట్టేశాయి. అసలు మ్యాటర్ ఏంటంటే.. ఇటీవల ఓ పబ్లిక్ మీటింగ్‌లో మైకు అందుకున్న రాధాకృష్ణన్ గారు, పొలిటికల్ విమర్శలు పక్కనబెట్టి పర్సనల్ లైఫ్ లోకి దూరేశారు. "రాజకీయాల్లోకి వచ్చి విజయ్ ఇరుక్కుపోయారు. ఇంట్లో నటి త్రిషతో ఎంతో సంతోషంగా ఉండేవారని, ఇప్పుడు ఆ రోజులను గుర్తు చేసుకుంటూ ఉంటారేమో" అంటూ లీకులు ఇచ్చారు. సరిగ్గా ఇక్కడే సీన్ రివర్స్ అయింది.. ప్రజా సమస్యలపై మాట్లాడమంటే.. ఎవరో ఇంట్లో ఏం జరుగుతుందో మనకెందుకు స్వామీ? అని సోషల్ మీడియా కోడై కూసింది. 'లియో' సినిమాలో విజయ్–త్రిష కెమిస్ట్రీ బాగా నచ్చేసిందో ఏమో గానీ, దాన్ని తెచ్చి పొలిటికల్ స్టేజీపై రుద్దేసరికి టీవీకే నేతలకు ఎక్కడో కాలింది. వెంటనే పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టేశారు.

**ముందస్తు బెయిల్ 'స్కెచ్' రివర్స్.. జైలులో రిమాండ్**

కేసు నమోదు కాగానే సీన్ అర్థమైన ఎమ్మెల్యే గారు, అరెస్ట్ నుంచి తప్పించుకోవడానికి మద్రాస్ హైకోర్టు మెట్లు ఎక్కారు. "అయ్యా.. నాది నోటి పొరపాటే.. ముందస్తు బెయిల్ ఇవ్వండి" అంటూ పిటిషన్ వేశారు. కానీ కోర్టు మాత్రం "మైకు దొరికితే ఏదైనా మాట్లాడతారా?" అన్నట్లుగా పిటిషన్‌ను నిర్మొహమాటంగా తిరస్కరించింది. ఇంకేముంది.. పోలీసులు ఎంట్రీ ఇచ్చి, ఆయన్ను అదుపులోకి తీసుకుని జడ్జి ముందు నిలబెట్టారు. కోర్టు కాస్తా సారు గారికి గట్టిగానే 'హోంవర్క్' ఇచ్చి, జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తూ జైలుకు పంపింది.

**సినిమా వేరు.. రాజకీయం వేరు బాసూ!**

రాజకీయాల్లో విమర్శలు ప్రతివిమర్శలు కామనే. పాలన బాగోలేదనో, విధానాలు నచ్చలేదనో తిట్టిపోస్తే అదో పద్ధతి. కానీ, ఇలా పర్సనల్ లైఫ్‌ను, అదీ ఒక మహిళా నటిని లాగి మాట్లాడటం ఏ రకమైన సంస్కారమో ఆ డీఎంకే ఎమ్మెల్యే గారికే తెలియాలి. ప్రస్తుతం ఈ వ్యవహారం తమిళనాడు పాలిటిక్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. డీఎంకే, టీవీకే మధ్య సోషల్ మీడియాలో పెద్ద 'కత్తియుద్ధమే' నడుస్తోంది.

ప్రజల ముందు మాట్లాడేటప్పుడు నోటికి కొంచెం 'సెన్సార్' వేసుకోకపోతే.. ఇలాగే రిమాండ్ రూమ్‌లో కూర్చుని "ఆ రోజులను గుర్తు చేసుకోవాల్సి వస్తుంది" అని రాజకీయ విశ్లేషకులు చెవులు పిండి చెబుతున్నారు. మరి ఇప్పటికైనా మన నేతలు మారతారా? లేక నెక్స్ట్ వికెట్ ఎవరిదా అని వెయిట్ చేయాలా? చూడాలి.

# కార్పొరేట్ ఉద్యోగం వదిలేసి.. అవోకాడో సాగుతో లక్షల సంపాదన!



లండన్, హైదరాబాద్ వంటి నగరాల్లో స్థిరపడిన ఉన్నత విద్యావంతులు సైతం నేడు సంప్రదాయ కార్పొరేట్ ఉద్యోగాల కంటే కమర్షియల్ హార్టికల్చర్ (వాణిజ్య పండ్ల సాగు) వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ సరికొత్త ట్రెండ్ భారతదేశంలో వ్యవసాయాన్ని ఒక లాభదాయకమైన వ్యాపారంగా నిలబడుతోందా? ఇది కేవలం కొద్దిమందికి మాత్రమే పరిమితమయ్యే ఒక తాత్కాలిక ప్రయోగమా? మనకు అర్థమవ్వాలంటే ఒక ఉదాహరణ ఇది. ఏఐ రాకతో ఉద్యోగాలు ఊడుతున్న ఈరోజుల్లో చాలామంది టెక్ ఉద్యోగులు ఇలాంటి ప్రత్యామ్నాయాలపై ఆలోచిస్తున్నారు.. పూర్తి కథనంలోకి వెళితే...

లండన్‌లో ఉన్నత చదువులు చదివి, విదేశాల్లో స్థిరపడే సదవకాశం ఉన్నా.. వాటన్నింటినీ వదిలేసి మళ్లీ మట్టిని నమ్ముకున్నాడు తెలంగాణకు చెందిన రామ్ భూపాల్. సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేశాక, లండన్ లోని ప్రఖ్యాత ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ నుండి మార్కెటింగ్‌లో ఎంబీఏ పట్టా అందుకున్నాడు. ఆ తర్వాత హీత్రూ ఎయిర్‌పోర్ట్ కస్టమ్స్ డిపార్ట్‌మెంట్‌లో.. అనంతరం హైదరాబాద్‌లోని ఒక లీడింగ్ రిటైల్ కంపెనీలో కార్పొరేట్ ఉద్యోగం చేశాడు. అయితే ప్రతిరోజూ తొమ్మిది నుంచి 5వరకూ సాగే ఉద్యోగం అతడికి విసుగును మిగిల్చింది.. ఆ క్రమంలోనే రంగారెడ్డిలోని సొంత ఊరికి చేరుకుని వ్యవసాయం చేయాలని నిర్ణయించుకున్నాడు. సాధారణ రైతులలాగా కాకుండా.. మార్కెట్ గ్యాప్‌లను అధ్యయనం చేసి వినూత్నంగా ఏదైనా చేయాలనుకున్నాడు భూపాల్. సాంప్రదాయ పంటలు లేదా సాధారణ పండ్ల (మామిడి, జామ) సాగులో ఉన్న మిగులు సరఫరా నష్టాలు.. ధరల పతనాన్ని గమనించిన అతడు విదేశీ పండ్ల వైపు దృష్టి పెట్టాడు. ఈ క్రమంలో 2013లో ఇజ్రాయెల్ దేశం నుండి ఒక్కో మొక్కను రూ. 1,200 చొప్పున వెచ్చించి 200 హాస్ అవోకాడో మొక్కలను దిగుమతి చేసుకున్నాడు. అయితే స్థానిక వాతావరణ పరిస్థితులు తట్టుకోలేక ఆ మొదటి ప్రయత్నం పూర్తిగా విఫలమైంది. మొదటి ఓటమితో అధైర్యపడకుండా.. మన వాతావరణ పరిస్థితులకు, అధిక ఉష్ణోగ్రతలకు తట్టుకునే సరికొత్త రకాలపై మళ్లీ పరిశోధనలు చేశాడు. దాదాపు 1.2 ఎకరాల భూమిలో 250 మొక్కలతో పూర్తి ఆర్గానిక్ (సేంద్రీయ) పద్ధతిలో అవోకాడో సాగును విజయవంతంగా ప్రారంభించాడు. 2023 నాటికి ఈ తోట నుండి మొదటి దిగుబడి ప్రారంభమైంది. ప్రారంభంలో తన స్నేహితుడి ద్వారా కువైట్ దేశానికి ఎగుమతి చేసిన జైపాల్... ఆ తర్వాత దేశీయ మార్కెట్లోనే నేరుగా కస్టమర్లకు విక్రయించడం ప్రారంభించాడు. ప్రస్తుతం ఒక్కో చెట్టు నుండి దాదాపు 20 కేజీల దిగుబడి వస్తోందని... కేజీ రూ. 250 చొప్పున అమ్ముతూ ఏడాదికి రూ. 8 లక్షల వరకు ఆదాయం ఆర్జిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

కేవలం పండ్లను అమ్మడమే కాకుండా.. తన ఎంబీఏ మార్కెటింగ్ తెలివితేటలను ఉపయోగించి భూపాల్ ఒక సమాంతర వ్యాపారాన్ని కూడా సృష్టించుకున్నాడు. తన పొలంలోనే అవోకాడో నర్సరీని ఏర్పాటు చేసి... వేడిని తట్టుకునే –పింకెర్టన్– వంటి ప్రీమియం రకాల మొక్కలను రూ. 300 నుండి రూ. 400 వరకు విక్రయిస్తున్నాడు. ఏడాదికి దాదాపు 5,000 నుండి 10,000 మొక్కలను అమ్మడం ద్వారా నర్సరీ నుండే అదనంగా మరో రూ. 5 లక్షల టర్నోవర్‌ను సాధిస్తున్నాడు. దళారులు, మండీలపై ఆధారపడకుండా వాట్సాప్– సోషల్ మీడియా ద్వారా నేరుగా కస్టమర్లకే విక్రయిస్తూ లాభాల మార్జిన్‌ను పెంచుకుంటున్నాడు.

భూపాల్ నాయక్ సాధించిన విజయం కేవలం ఒక వ్యక్తిగత సక్సెస్ స్టోరీ మాత్రమే కాదు.. నేటి యువతకు... ముఖ్యంగా చదువుకున్న నిరుద్యోగులు లేదా ఉద్యోగులకు ఒక పెద్ద రోల్ మోడల్. వ్యవసాయం అంటే కేవలం శ్రమతో కూడుకున్న నష్టాల వ్యాపారం కాదు... సరైన మార్కెట్ అవగాహన, ఆధునిక సేంద్రీయ పద్ధతులు పాటిస్తే ఐటీ ఉద్యోగాల కంటే మెరుగైన లైఫ్ స్టైల్ , ఆదాయాన్ని సొంత గడ్డపైనే సాధించవచ్చని ఆయన నిరూపించాడు. ఉన్నత చదువులు చదివిన వారు ఇలా –రివర్స్ మైగ్రేషన్– ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం దేశ భవిష్యత్తుకు ఎంతో శు భసూచకం. ముఖ్యంగా పంట పండించేందుకు భూమి ఉన్నా చాలామంది సాగు చేయడానికి సిద్ధంగా లేరు. ఇలాంటి నిరాసక్త వ్యక్తులు వ్యూహాత్మకంగా కొత్తగా ఎలా ఆలోచించాలో కూడా ఇతడు నేర్పిస్తున్నాడు. (నోట్: కృత్రిమ మేధస్సు ప్రకంపనాల కాలంలో ఉద్యోగాల గల్లంతయ్యే క్రమంలో ఇలాంటి ఐడియాలు పదిమందికి ఉపయోగపడాలని ఆశిస్తూ..)

# తప్పు ఒప్పుకోరు.. తగ్గేదే లే అంటారు: సియా గోయల్ 'సిగ్గులేని' సిగ్నల్స్



పుణే వ్యాపారవేత్త కేతన్ అగర్వాల్ హత్య కేసు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. కాబోయే భర్తను కిరాతకంగా చంపేసిందనే ఆరోపణలతో జైల్లో ఊచలు లెక్కపెడుతున్న ప్రధాన నిందితురాలు సియా గోయల్.. తాజాగా మరోసారి హెడ్‌లైన్స్‌లోకి వచ్చింది. జైల్లో పెట్టినా, చేతులకు బేడీలు వేసినా అమ్మడి యాటిట్యూడ్‌లో మాత్రం నయాపైసా మార్పు రాలేదని నిరూపించుకుంది. విచారణ కోసం పోలీసులు ఆమెను ఇంటికి తీసుకెళ్తే.. అక్కడ మీడియా కెమెరాలను చూసి నీళ్లు నములుతుందో.. తలదించుకుంటుందో అనుకుంటే పొరపాటే.. సినిమా హీరోల రేంజ్‌లో బిల్డప్ ఇస్తూ ఏకంగా మీడియా వైపు చూస్తూ 'మిడిల్ ఫింగర్' చూపించి తన సంస్కారాన్ని నడిరోడ్డుపై ప్రదర్శించింది. "నేను తప్పు చేశానా? నాకా పశ్చాత్తాపం? తొక్కేం కాదు!" అన్నట్లుగా ఉన్న ఆమె బాడీ లాంగ్వేజ్ చూసి నెటిజన్లు, స్థానికులు నోరెళ్లబెడుతున్నారు.

**బాధితురాలి బదులు 'గ్యాంగ్‌స్టర్' బిల్డప్**

సాధారణంగా హత్య కేసుల్లో ఇరుక్కున్న వారు పోలీసుల జీపు ఎక్కుతుంటేనే మొహం చాటేసుకుంటారు. సమాజానికి ఏం సమాధానం చెప్పాలా అని సిగ్గుతో చచ్చిపోతుంటారు. కానీ మన సియా గోయల్ రూటే సెపరేటు.. కాబోయే భర్త ప్రాణాలు పోయాయన్న కనీస బాధ కానీ, జైలుకు వెళ్లానన్న పశ్చాత్తాపం కానీ ఆమె ముఖంలో లవలేశమైనా కనిపించకపోవడం గమనార్హం. ఇలాంటి వికృత చేష్టలు చూశాక నెటిజన్లు ఊరుకుంటారా? సోషల్ మీడియా వేదికగా ట్రోలింగ్‌తో మోతెక్కిస్తున్నారు. "చట్టం అంటే భయం లేదు, సమాజం అంటే గౌరవం లేదు.. ఏం యాటిట్యూడ్ తల్లీ!" అంటూ కొందరు సెటైర్లు వేస్తుంటే.. "ఈమెను జైల్లో కాదు, మెంటల్ హాస్పిటల్‌లో పెట్టాలి" అని మరికొందరు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చేసిన తప్పుకు కోర్టు శిక్ష వేయకముందే.. తన ప్రవర్తనతో ప్రజల గుండెల్లో ఆల్రెడీ 'నేరస్థురాలిగా' ముద్ర వేయించుకుంది ఈ కిలాడీ లేడీ.

**చట్టం తన పని తాను చేసుకుపోతుందా? లేక ఈమె ఇలాగే చూపిస్తుందా?**

ఈ వైరల్ వీడియో సోషల్ మీడియాలో రచ్చ లేపుతుండటంతో న్యాయ నిపుణులు సైతం ముక్కున వేలేసుకుంటున్నారు. కోర్టు తీర్పు వచ్చే వరకు ఎవరినీ నేరస్థులుగా ముద్ర వేయకూడదనేది చట్టం చెప్పే మాట. కానీ నిందితురాలే స్వయంగా ఇలాంటి 'అసభ్య' సంకేతాలతో సమాజాన్ని ఉడికిస్తుంటే చట్టంపై ప్రజలకు నమ్మకం ఎలా ఉంటుంది? ఏది ఏమైనా కేతన్ అగర్వాల్ హత్య కేసు దర్యాప్తు ఒకవైపు సాగుతుంటే.. సియా గోయల్ చూపించిన ఆ ఒక్క వేలు మాత్రం ఈ కేసును జాతీయ స్థాయిలో మరో లెవెల్‌కు తీసుకెళ్లింది. పోలీసులు విచారణ పూర్తి చేసి కోర్టులో ఎలాంటి శిక్ష పడేలా చేస్తారో చూడాలి. కానీ ప్రస్తుతానికి మాత్రం ఈమె చేసిన పనికి నెటిజన్లు ఇచ్చే 'డిజిటల్ ప్యాసింజర్ థియేటర్' శిక్షను మాత్రం తప్పించుకోలేదు!

## విచారణలేని విచారం!

భారత సర్వోన్నత న్యాయస్థానం ఈ ఏడాది ఆరంభంలో 2020 ఢిల్లీ అల్లర్ల కేసులో ఉమర్ ఖలీద్, షర్జీల్ ఇమామ్‌లకు బెయిల్ నిరాకరించింది. అదే కేసులో మరో ఐదుగురికి బెయిల్ మంజూరు చేసింది. ఈ నిర్ణయం ఒక తీవ్రమైన, మౌలికమైన ప్రశ్నను మళ్లీ తెరపైకి తెచ్చింది. నేరస్థులుగా నిరూపించబడకుండా ఒక వ్యక్తిని జైల్లో ఉంచడానికి గరిష్ఠ పరిమితి ఎంత? విచారణ జరగకుండా జైల్లో ఉంచడం ఎంతకాలం వరకు న్యాయమవుతుంది? ఉమర్ ఖలీద్, షర్జీల్ ఇమామ్‌లు న్యాయస్థానం నిర్ణయం వెలువరించిన నాటికి ఐదేళ్ళకు పైగా విచారణ లేకుండా జైల్లో ఉన్నారు; ఇప్పుడు ఆ వ్యవధి ఆరేళ్ళకు చేరుకుంటోంది. ఒక వ్యక్తి నేరం చేశాడని నిరూపించకముందే ఆరేళ్లు జైల్లో ఉంచడం.. ఇది న్యాయమా? చట్టబద్ధ పాలనకు కట్టుబడ్డ రాజ్యాంగ వ్యవస్థలో ఇది సాధ్యమా? అన్న ప్రశ్నలు న్యాయ, రాజకీయ, మానవీయవర్గాల్లో చర్చలకు తావిస్తున్నాయి. చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం (యూఏపీఏ) కింద నమోదైన కేసుల్లో బెయిల్ పొందడం అత్యంత కష్టతరం. ఈ చట్టం కింద బెయిల్ మంజూరుకు కఠినమైన నిబంధనలుంటాయి. అయితే సర్వోన్నత న్యాయస్థానం తన పూర్వ తీర్పుల్లో స్పష్టం చేసింది –విచారణలో జాప్యం జరిగినప్పుడు రాజ్యాంగంలోని 21వ అధికరణం కింద వ్యక్తి స్వేచ్ఛకు హక్కు సంక్రమిస్తుందని. అంటే చట్టబద్ధ పరిమితులు రాజ్యాంగ హక్కులను అధిగమించలేవు. కానీ తాజా బెంచ్ నిర్ణయంలో.. విచారణలో జాప్యం బెయిల్‌కు నిరపేక్ష హక్కు ఇవ్వదని, నేరం తీవ్రత, జాప్యానికి బాధ్యత ఎవరిదో వంటి అంశాలతో సమతూకం చేయాలని పేర్కొన్నారు. ఈ వాదన పైపైన సమంజసంగా అనిపించవచ్చు. కానీ దాని లోపల ఒక ప్రమాదకరమైన తర్కం దాగి ఉంది.

నేరం తీవ్రత అనేది బెయిల్ విషయంలో తొలి నిర్ణయ అంశం, నిజమే! అయితే విచారణ జాప్యంతో అత్యంత ముఖ్యమైన మానవ హక్కు ప్రశ్నగా మారినప్పుడు, మళ్లీ నేరం తీవ్రతను తెచ్చి అడ్డుపెట్టడం.. ఇదొక జారే వాలును సృష్టిస్తుంది. ఆ వాలు మీద నిలబడితే –తీవ్రమైన నేరాల్లో అభియోగం మోపబడిన వ్యక్తులను దశాబ్దాల పాటు విచారణ లేకుండా జైల్లో ఉంచవచ్చు. ఇది కేవలం సైద్ధాంతిక ప్రమాదం కాదు, ఇప్పటికే జరిగింది. యూఏపీఏ కింద అభియోగం మోపబడిన కొందరు వ్యక్తులు రెండు దశాబ్దాలకు పైగా జైల్లో ఉన్న తర్వాత చివరకు నిర్దోషులని తేలారు. వారి జీవితంలోని అత్యంత విలువైన సంవత్సరాలు జైలు గోడలమధ్యే గడిచిపోయాయి. ఈ దుఃఖకర సత్యం ఒకసారి కాదు, పలుమార్లు జరగడం.. న్యాయస్థానాలు మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని హెచ్చరించడం లేదా? విచారణ జాప్యానికి నిందితుడే బాధ్యుడని వాదించడం కూడా నిలబడదు. ఒక నిందితుడు ఎన్ని దరఖాస్తులు దాఖలు చేసినా, విచారణ వేగంపై అంతిమ బాధ్యత న్యాయమూర్తిదే. కోర్టు గది, కేసు పురోగతి, వాదనల వేగం.. ఇవన్నీ న్యాయమూర్తి నియంత్రణలో ఉంటాయి. కాబట్టి జాప్యాన్ని నిందితుడిపై మోపడం.. బాధ్యత నుంచి న్యాయ వ్యవస్థ తప్పించుకోవడమే అవుతుంది. అదే సమయంలో న్యాయవ్యవస్థలో అంతర్గత వైరుధ్యాలు కూడా ఈ కేసులో స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఢిల్లీ హైకోర్టు ఇటీవల కాశ్మీర్ మానవహక్కుల కార్యకర్త ఖుర్రం పర్వేజ్‌కు నాలుగేళ్ళకు పైగా విచారణ లేకుండా జైల్లో ఉన్నారని బెయిల్ మంజూరు చేసింది, సరైన నిర్ణయమే.

కానీ ఆ బెయిల్ మంజూరు చేసిన న్యాయమూర్తే గతంలో ఢిల్లీ అల్లర్ల కేసుల్లో అదే నాలుగేళ్ళ వ్యవధి గడిచినా బెయిల్ నిరాకరించారు. అంతే కాదు.. అదే కేసుల్లో, అదే వాస్తవాల ఆధారంగా, అదే న్యాయమూర్తి ఒక ఏడాది వ్యవధిలో పరస్పర విరుద్ధమైన బెయిల్ తీర్పులు వెలువరించారు. ఇలాంటి అసమానత, అస్థిరత చట్టబద్ధపాలన పట్ల ప్రజలకుండే విశ్వాసాన్ని దెబ్బతీస్తుంది.


ఈ పరిస్థితి మరింత సంక్లిష్టంగా మారడానికి ఒక ముఖ్యమైన కారణం ఉంది –యూఏపీఏ వంటి చట్టాలకు నిస్సందేహంగా రాజకీయ స్వభావం ఉంది. ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలు ఇలాంటి చట్టాలను రాజకీయ అసమ్మతికి వ్యతిరేకంగా వాడుకుంటున్నాయని నిరూపితమైంది. రాజకీయ విభేదం, చట్టపరమైన "తీవ్రవాదం" మధ్య రేఖ మసకబారేలా ఈ చట్టాలను వ్యాఖ్యానించడం ప్రభుత్వాలకు సులభంగా మారుతోంది. ఇటీవల యూకె, అమెరికాల్లో ఫలస్తీన్ విషయమై జరిగిన ఆందోళనల విషయంలో అసమ్మతిపై ఒత్తిడి చేయడం ఇందుకు ఉదాహరణ. ఇలాంటి నేపథ్యంలో

### సంపాదకీయం

న్యాయవ్యవస్థ పాత్ర మరింత కీలకమవుతుంది. ఈ చట్టాలు ఆయుధాలుగా మారకుండా నిరోధించే బాధ్యత న్యాయస్థానాలదే. సర్వోన్నత న్యాయస్థానంలో మరో రెండు న్యాయమూర్తుల బెంచ్ ఢిల్లీ అల్లర్ల బెయిల్ నిరాకరణను తప్పుగా విమర్శించింది, ఇది అరుదైన పరిణామం. రాజ్యాంగం నిర్దేశించిన చట్టబద్ధ పాలనలో విచారణ లేకుండా అనంతకాలం జైల్లో ఉంచడం మౌలికంగా తప్పని వారు స్పష్టం చేశారు. దీంతో ప్రధాన న్యాయమూర్తి పెద్ద బెంచ్‌కు నిర్ణయాన్ని పంపారు. కానీ ఆ పెద్ద బెంచ్ ఎప్పుడు తీర్పు ఇస్తుందో తెలియదు. విచారణ లేని జైలు శిక్ష –ఇది కేవలం న్యాయపరమైన ప్రశ్న మాత్రమే కాదు. సామాజికంగా మనం ప్రజాస్వామ్య విలువలకు, మానవ హక్కులకు ఎంత నిజాయితీగా కట్టుబడి ఉన్నామన్న ప్రశ్న. "విచారణే శిక్ష" అన్న పాత నానుడి నిజమయ్యే పరిస్థితి రాకూడదంటే –న్యాయస్థానాలు ధైర్యంగా, సమానంగా వ్యవహరించాలి. విచారణ లేకుండా జైలు అంటే మానవ గౌరవాన్ని హరించడమే. ఆ చక్రాన్ని తెంచే సమయం ఆసన్నమైంది. 19వ శతాబ్దంలో ఫ్రాన్స్‌లో ఆల్ఫ్రెడ్ డ్రేఫస్ అనే సైనికుడిని నేరం నిరూపించకుండా ఐదేళ్లు జైల్లో ఉంచారు. ఆ కేసు తర్వాత అతను నిర్దోషిగా తేలింది. ఆ విషాదం ఫ్రాన్స్ న్యాయ వ్యవస్థలో సంస్కరణలకు దారి తీసింది. భారత్‌లో కూడా ఇలాంటి సంస్కరణలు అవసరమని కేసులు స్పష్టం చేస్తున్నాయి. యూఏపీఏ వంటి చట్టాల అమలులో మరింత జవాబుదారీతనం, విచారణ వేగంపై కచ్చితమైన గడువులు, బెయిల్ నిర్ణయాల్లో స్థిరత్వం.. ఇవి తక్షణావసరం. ఒక వ్యక్తి నేరస్థుడా కాదా అని నిర్ణయించే ముందే దశాబ్దాల జైలు జీవితం అనుభవింపజేయడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం, మానవ నైతికతకు వ్యతిరేకం. న్యాయం జాప్యం చేస్తే అది అన్యాయమే అవుతుందన్న సూత్రం కోర్టు గదుల్లో ఫ్రేమ్ చేసి వేలాడదీయడానికి మాత్రమే కాదు, ఆచరణలో నిలబెట్టడానికి కూడా. ఉమర్ ఖలీద్, షర్జీల్ ఇమామ్‌ల కేసు కేవలం వ్యక్తిగత కేసు మాత్రమే కాదు –ఇది భారత న్యాయ వ్యవస్థ తన అంతరాత్మను పరీక్షించుకునే అవకాశం. అది జరిగితేనే.. న్యాయం నిలబడినట్టు!!

---

### పనికొచ్చే మాట



## 90ఏళ్ల యువకుడి జిమ్ వర్కౌట్స్!

శరీరంలో మునుపటిలాంటి సత్తా లేదనో, లేక మోకాళ్ల నొప్పులనో వృద్ధాప్యం రాగానే చాలామంది శారీరక శ్రమకు దూరం జరుగుతారు. కానీ, వయసు పెరిగేకొద్దీ వ్యాయామం మరింత అవసరమని చెబుతున్నారు ముంబయికి చెందిన ప్రముఖ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ ఆకాష్ సింగ్. ఆయన క్లినిక్‌కు వచ్చే 90ఏళ్ల వృద్ధుడు జిమ్‌లో కుర్రాళ్లకు పోటీగా కఠినమైన వ్యాయామాలు చేస్తున్న వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు. ఈ వయసులోనూ ఆయన చూపిస్తున్న పట్టుదల, క్రమశిక్షణ చూసి నెటిజన్లు సెల్యూట్ చేస్తున్నారు. మన ఇంట్లో ఉండే తల్లిదండ్రులను, నానమ్మ, తాతయ్యలను కూడా ఇలాంటి ఫిట్‌నెస్‌వైపు ప్రోత్సహించాల్సిన అవసరాన్ని ఈ వీడియో గుర్తుచేస్తోంది.

జిమ్ అంటే కేవలం సిక్స్ ప్యాక్ కోసం కాదు!

"జిమ్ అనేది కేవలం సిక్స్ ప్యాక్ బాడీ బిల్డర్ల కోసం, యువత కోసం మాత్రమే అనుకోవడం పెద్ద అపోహ" అని డాక్టర్ ఆకాష్ పేర్కొన్నారు. 90 ఏళ్ల వృద్ధుడు జిమ్‌లో మొబిలిటీ డ్రిల్స్, అసిస్టెడ్ స్క్వాట్స్, రెసిస్టెన్స్ బ్యాండ్ రోయింగ్, డంబెల్స్‌వంటి ఎన్నో రకాల స్ట్రెంత్, కోర్ బిల్డింగ్ వ్యాయామాలను అలవోకగా చేస్తున్నారన్నారు. వృద్ధాప్యంలో జిమ్‌కు వెళ్లడమంటే అందంగా కనిపించడం కోసం కాదు, రోజువారీ పనులను ఎవరి సహాయం లేకుండా చేసుకోగలిగేలా కండరాల బలాన్ని పెంచుకోవడం కోసమని ఆయన వివరించారు.

**వృద్ధుల వ్యాయామంతో 5 ప్రయోజనాలు:**

వృద్ధాప్యంలో వ్యాయామం ఆపేయడంవల్లే శరీరం మరింత బలహీనపడుతుందని, నిరంతరం కదలికల్లో ఉండటంవల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలున్నాయని వైద్యులు చెబుతున్నారు.

ఆత్మవిశ్వాసం, స్వతంత్రత: ఎవరిపైనా ఆధారపడకుండా తమ పనులు తామే చేసుకునే శారీరక బలం లభిస్తుంది.

కదలికల్లో చురుకుదనం: శరీరంలో నొప్పులు, కీళ్ల బిగుతు తగ్గి, నడవడానికి, వంగడానికి అవసరమైన ఫ్లెక్సిబిలిటీ పెరుగుతుంది.

బలమైన ఎముకలు, కండరాలు: వయసుతోపాటు వచ్చే కండరాల క్షీణతను అడ్డుకుని, ఎముకల సాంద్రతను మెరుగుపరుస్తుంది.

నొప్పులనుంచి ఉపశమనం: దీర్ఘకాలిక కీళ్ల నొప్పులు, కండరాల నొప్పుల తీవ్రత తగ్గుతుంది.

దీర్ఘాయువు: శారీరక శ్రమవల్ల గుండె జబ్బులు, స్ట్రోక్, బీపీవంటి ముప్పులు తగ్గి, ఆరోగ్యకరమైన సుదీర్ఘ జీవితాన్ని గడపవచ్చు.

"మనం ముసలివాళ్లం అయ్యామని వ్యాయామం ఆపము.. వ్యాయామం ఆపేయడం వల్లే ముసలివాళ్లం అవుతాం" అని డాక్టర్ ఆకాష్ వ్యాఖ్యానించారు. 18 ఏళ్ల వారైనా, 89 ఏళ్ల వారైనా స్ట్రెంత్ ట్రైనింగ్ అనేది అందరికీ అవసరమని స్పష్టం చేశారు.

నెటిజన్లు ఏమంటున్నారంటే..

ఈ వీడియో సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసిన కొద్దిసేపట్లోనే విపరీతంగా వైరల్ అయింది. ఈ వృద్ధుడి ఎనర్జీ లెవెల్స్ చూసిన ఒక నెటిజన్.. "ఈ తాత తన వయసును ఓ పదేళ్లు వెనక్కి నెట్టేసారు," అని కామెంట్ చేయగా.. "నిజమైన ఇన్‌ఫ్లుయెన్సర్ అంటే ఈయనే, మన తల్లిదండ్రుల ఫోన్ ఫీడ్‌లో ఇలాంటి వీడియోలే రావాలి," అని మరొకరు రాసుకొచ్చారు. అమెరికాకు చెందిన ప్రముఖ 'జాన్స్ హాప్‌కిన్స్' నివేదిక ప్రకారం.. కూడా క్రమం తప్పకుండా వ్యాయామం చేసే వృద్ధుల్లో నిద్రలేమి, ఒత్తిడి సమస్యలు తగ్గి, ప్రమాదవశాత్తు కిందపడిపోయే అవకాశాలు చాలా వరకు తగ్గుతాయని తేలింది.

---

# విశ్వ శక్తి..! విలక్షణ గాథ!!




జూలై 4, 1776న 13 రాష్ట్రాలతో జన్మించిన చిన్న దేశం, రెండున్నర శతాబ్దాల్లో ప్రపంచ చరిత్రనే తిరిగి రాసింది. కాలినడకల నుంచి క్వాంటం కంప్యూటర్ల దాకా, బానిసత్వం నుంచి పౌరహక్కుల దాకా, చంద్రుడిపై తొలి అడుగు నుంచి కృత్రిమ మేధ విప్లవం దాకా.. ప్రతి మలుపులో అమెరికా ముందే నిలిచింది. యుద్ధాలు చేసింది. తప్పులు చేసింది. కానీ ప్రతిసారీ లేచి నిలబడింది. 29 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థతో నేటికీ ప్రపంచ వ్యవహారాల కేంద్రంగా వెలుగొందుతున్న అమెరికా ఈ రోజు కొత్త వసంతాన్ని జరుపుకుంటోంది. ఇది.. దేశం కాదు.. నిరంతరంగా సాగుతున్న ప్రయోగం.

జూలై 4, 1776, చరిత్ర తన గమనాన్ని మార్చుకున్న రోజు. బ్రిటన్ వలస సంకెళ్ళను తెంచుకుంటూ 13 రాష్ట్రాలతో కూడిన చిన్న దేశం జన్మించింది. ఆ రోజు ఎవరూ ఊహించి ఉండరు.. రెండున్నర శతాబ్దాల తర్వాత ఆ చిన్న దేశం ప్రపంచ చరిత్రను తిరగ రాస్తుందని. ఈ రోజు జూలై 4, 2026. అమెరికా స్వాతంత్ర్యానికి సరిగ్గా 250 సంవత్సరాలు పూర్తవుతున్న రోజు. అర్ధ సహస్రాబ్ది పండుగలో అమెరికా సంబరాలు చేసుకుంటోంది. ఫిలడెల్ఫియా నుంచి వాషింగ్టన్ వరకూ వేడుకలు జరుగుతున్నాయి. కానీ ఈ వేడుక వెనుక ఉన్న అసలు కథ.. రెండున్నర శతాబ్దాల పరిణామం, పతనాలు, పునరుజ్జీవనాలు –అది మరింత లోతైనది, సంక్లిష్టమైనది, ఆలోచింపజేసేది. ప్రపంచం ఎన్నో సామ్రాజ్యాల వైభవాన్ని చూసింది. రోమన్ సామ్రాజ్యం, మొఘల్ సామ్రాజ్యం, బ్రిటిష్ సామ్రాజ్యం.. అన్నీ ఒకసారి శిఖరాగ్రాన ఉండి, తర్వాత చరిత్ర పుటల్లోకి వెళ్ళిపోయాయి. కానీ అమెరికా కేవలం ఒక సామ్రాజ్యంగా మిగిలిపోలేదు; ఒక ప్రయోగంగా, ఒక భావనగా, ఒక కలగా ప్రపంచ మనస్సులో స్థిరపడింది. ఆర్థికం, ఆవిష్కరణ, విజ్ఞానం, వినోదం, రణం, వితరణం, యంత్రం, తంత్రం.. అన్నింటిలో తనదైన ముద్ర వేసిన ఘనత అమెరికాకే సొంతం. వ్యవసాయాధార దేశంగా మొదలై, పారిశ్రామిక శక్తిగా ఎదిగి, సాంకేతిక విప్లవానికి ఆద్యుడిగా నిలిచి, అంతరిక్ష యుగానికి తెర తీసి –ఇప్పుడు కృత్రిమ మేధ యుగంలోనూ అగ్రభాగాన నిలిచింది అమెరికానే. 1880ల మధ్యలోనే బ్రిటన్‌ను అధిగమించి తయారీ వస్తువులు, ఉక్కు ఉత్పత్తిలో ప్రపంచ అగ్రస్థానానికి చేరింది. 1969లో నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ చంద్రుడిపై అడుగుపెట్టినప్పుడు –అది కేవలం ఒక అమెరికన్ విజయం కాదు, మానవాళి సాధించిన శిఖరం. ఇవాళ అమెరికా జీడీపీ 29 ట్రిలియన్ డాలర్లకు పైగా.. ప్రపంచ మొత్తం ఆర్థిక ఉత్పత్తిలో దాదాపు నాలుగోవంతు ఒక్క దేశమే సాధిస్తోంది.

అయితే అమెరికా గాథ కేవలం విజయాల కథ మాత్రమే కాదు.. అంతరంగ సంఘర్షణల కథ కూడా. పైకి ఒకే దేశమైనా, రెండు అమెరికాలు దాగి ఉన్నాయి. ఒకటి –అవకాశాల గని, కలలను నెరవేర్చే వేదిక, ప్రపంచ మేధస్సును ఆహ్వానించే వ్యవస్థ. రెండోది –అసమానతలు, జాతివివక్ష, తుపాకీ హింస, ఆరోగ్య సేవలకు అందని కోట్లాది మంది జీవితాల కష్టాల కథ. బానిసత్వం అమెరికా జన్మలోనే పొందుపడిన పాపం. 1865లో బానిసత్వం రద్దయినా, జాతివివక్ష శతాబ్దాలపాటు కొనసాగింది. 1960ల పౌరహక్కుల ఉద్యమం, మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ "ఐ హ్యావ్ ఎ డ్రీమ్" ప్రసంగం –వీటన్నింటికీ వెనుక ఉన్న బాధ, అది పుట్టించిన శక్తి అమెరికాను మరింత మానవీయంగా మార్చింది. 2008లో బరాక్ ఒబామా అధ్యక్షుడు కావడం ఒక చారిత్రక మలుపు. అది ఆ దేశం తనను తాను సరిచేసుకోగలదని చూపించింది. స్పెయిన్–అమెరికా యుద్ధం (1898) నుంచి మొదలుకుని, రెండు ప్రపంచ యుద్ధాలు, కొరియా, వియత్నాం, ఇరాక్, అఫ్ఘానిస్తాన్.. ఈ యుద్ధ గాథల మూలాల్లో అమెరికా శక్తి వ్యక్తమైంది, కానీ వైఫల్యాలూ దాగి ఉన్నాయి. 1945లో హిరోషిమా, నాగసాకిపై అణుబాంబుల విషాదం –ఆ నిర్ణయం నేటికీ నైతిక చర్చలకు కేంద్రంగా ఉంటుంది. శీతల యుద్ధం కాలంలో సోవియట్ యూనియన్‌తో అంతరిక్ష పోటీ, అణ్వాయుధ పోటీ –ఇవి ప్రపంచాన్ని అంచున నిలిపాయి. 1991లో సోవియట్ పతనంతో అమెరికా ఏకైక అగ్రశక్తిగా మిగిలింది. కానీ ఆ ఏకధ్రువ ప్రపంచం కూడా నిలబడలేదు. 2001 సెప్టెంబర్ 11 దాడులు అమెరికా అభేద్యమైన కోట అన్న భ్రమను పటాపంచలు చేశాయి. 2008 ఆర్థిక సంక్షోభం ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ బలహీనతలను బహిర్గతం చేసింది. అయినా అమెరికా ప్రతిసారీ లేచి నిలబడింది. ఆ పునరుజ్జీవన శక్తే దాన్ని 250 సంవత్సరాల తర్వాత కూడా ప్రాసంగికంగా నిలిపింది.

250 సంవత్సరాల అమెరికా ప్రయాణంలో ఒక నిజం స్పష్టంగా కనిపిస్తుంది, ఇది ఒక జాతి నిర్మించిన దేశం కాదు. ప్రపంచంలోని జాతులన్నీ కలిసి నిర్మించుకున్న దేశం. ప్రపంచం నలుమూలల నుంచి వలస వచ్చిన ప్రజలు, భాషలు, మతాలు, సంస్కృతులు కలిసి రూపొందించిన సామాజిక ప్రయోగం. ఎక్కడెక్కడి నుంచో వచ్చినవారి కలలు అక్కడ పరిశ్రమలుగా మారాయి. పరిశ్రమలు సంపదను సృష్టించాయి. సంపద పరిశోధనకు బలమిచ్చింది. పరిశోధన ప్రపంచాన్ని మార్చే ఆవిష్కరణలకు దారి తీసింది. అందుకే అమెరికా అగ్రరాజ్యమైంది. ఇప్పుడు 2026లో అమెరికా కొత్త సవాళ్లు ఎదుర్కొంటోంది. ట్రంప్ 2.0 పాలనలో "అమెరికా ఫస్ట్" విధానం, మిత్రదేశాలపై సుంకాలు, నాటోనుంచి వైదొలగే ధోరణి.. ఇవి అమెరికా అంతర్జాతీయ నాయకత్వ పాత్రను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. చైనా ఆర్థికంగా, సాంకేతికంగా దగ్గరవుతోంది; అమెరికా ఆధిపత్యానికి నిజమైన సవాలు విసురుతోంది. కృత్రిమ మేధ రంగంలో పోటీ కొత్త శీతల యుద్ధంగా రూపుదాల్చుతోంది. అంతర్గతంగా అసమానతలు, రాజకీయ ధ్రువీభవనం, జనాభా మార్పులు.. ఇవి అమెరికన్ గుర్తింపు ఏమిటన్న ప్రశ్నను మళ్లీ ముందుకు తెస్తున్నాయి. అయితే చరిత్ర చెప్పే పాఠం ఏమిటంటే –అమెరికా ప్రతి సంక్షోభంలోనూ తనను తాను పునర్నిర్మించుకుంది. మహా మాంద్యం తర్వాత న్యూ డీల్ తెచ్చింది. రెండో ప్రపంచ యుద్ధంలో విజయం సాధించింది. శీతల యుద్ధంలో నిలబడింది. 9/11 తర్వాత తెప్పరిల్లింది. ఈ పునరుజ్జీవన సామర్థ్యమే అమెరికాను 250 సంవత్సరాల తర్వాత కూడా ప్రపంచ వ్యవహారాల కేంద్రంలో నిలిపింది. 250 సంవత్సరాల అమెరికా ప్రయాణం ప్రపంచానికి ఒక పాఠం నేర్పింది; వైవిధ్యం బలహీనత కాదు, బలం; ప్రశ్నించే స్వేచ్ఛ పురోగతికి పునాది; తప్పులను అంగీకరించి సరిదిద్దుకోగలిగే వ్యవస్థే నిజమైన ప్రజాస్వామ్యం. ఈ మూడు సూత్రాలే అమెరికాను అమెరికాగా చేశాయి. అవే దాన్ని మరో 250 సంవత్సరాలు ముందుకు నడిపించాయి.. నడిపిస్తూనే ఉంటాయి!! ■

---



మనం అనుకున్న విజయాలు సాధించకపోవడానికి మన అలవాట్లు, నిర్ణయాలే ప్రధాన కారణం! ప్రతి ఒక్కరూ గెలవాలనే కోరుకుంటారు. కానీ గెలుపు కోసం ఏం చేయాలో అది చేయరు. మనం ఏం మాట్లాడుతున్నాం అనే దానికంటే, రోజూ ఏం చేస్తున్నాం అనేదే ముఖ్యం. ఎందుకంటే మీ చేతలే మీ నిజమైన ఆలోచనలు. మిగతావన్నీ పైపై మాటలే! కాబట్టి ఈ రోజు నుంచే మీ దినచర్యను పరిశీలించండి. మీరు కోరుకునే జీవితానికి తగిన అలవాట్లు మీలో ఉన్నాయా అని నిజాయితీగా అడిగి చూసుకోండి. గుర్తుంచుకోండి.. గెలుపు ఒక్కరోజులో రాదు. కానీ ప్రతిరోజూ సరైన పని చేసినప్పుడు అది రాకుండా పోదు. తప్పక వచ్చి తీరుతుంది!

-మహాదేవ

---

### వింతల్లో వింతలు

## బొద్దింక డైవర్



సింగపూర్‌లోని నాన్యాంగ్ టెక్నాలజికల్ వర్సిటీ శాస్త్రవేత్తలు అద్భుతమైన ఆవిష్కరణ చేశారు, బొద్దింకలకు మినియేచర్ డైవింగ్ సూట్ తయారు చేశారు! ఈ సూట్ వేసుకున్న బొద్దింక నీటిలో మూడు గంటలపాటు ఊపిరి పీల్చుకుంటూ తిరగగలదు. సాధారణంగా అందరూ చంపాలనుకునే ఈ పురుగును శాస్త్రవేత్తలు "సైబోర్గ్ కీటకం"గా మార్చారు. మడగాస్కర్ హిస్సింగ్ బొద్దింకలకు ఎలక్ట్రోడ్లు అమర్చి రిమోట్ కంట్రోల్‌తో నడిపించగలరు. 3డి ప్రింటెడ్ రెజిన్ సూట్‌లో హైడ్రోజన్ పెరాక్సైడ్, మాంగనీస్ డయాక్సైడ్ మిశ్రమం ఆక్సిజన్ ఉత్పత్తి చేస్తుంది. పరీక్షల్లో సెకనుకు 78.4 మిల్లీమీటర్ల వేగంతో నీటిలో కదలగలిగాయి. 2025లో మయన్మార్ భూకంప సహాయక కార్యక్రమంలో ఇవి వాస్తవంగా పాల్గొన్నాయి. భవిష్యత్తులో అంగారకుడిపై పరిశోధనలకు వాడాలని శాస్త్రవేత్తల కల!

# భారత్‌తో రెండో టీ20.. ఇంగ్లండ్ తుది జట్టు ప్రకటన!

మాంచెస్టర్ వేదికగా శనివారం భారత్‌తో జరగనున్న రెండో టీ20 కోసం ఇంగ్లండ్ తమ తుది జట్టును ప్రకటించింది. తొలి టీ20కు విశ్రాంతి తీసుకున్న స్టార్ ఫాస్ట్ బౌలర్ జోఫ్రా ఆర్చర్ తిరిగి ప్లేయింగ్ ఎలెవన్‌లోకి వచ్చాడు. పేసర్లు ల్యూక్ వుడ్, సాకిబ్ మహమూద్ స్థానాల్లో జోఫ్రా ఆర్చర్, జోష్ టంగ్‌లకు తుది జట్టులో చోటు దక్కింది. ఈ మ్యాచ్‌తో జోష్ టంగ్ ఇంగ్లండ్ తరపున టీ20 అరంగేట్రం చేయనున్నాడు. టంగ్ ఇప్పటికే టెస్ట్ జట్టులో రెగ్యులర్ బౌలర్‌గా కొనసాగుతున్నాడు. ఈ రైట్ ఆర్మ్ పేసర్ ఇప్పటివరకు ఇంగ్లండ్ తరపున 12 టెస్ట్ మ్యాచ్‌లు ఆడాడు. టీ20ల్లో మాత్రం అతడికి పెద్దగా అనుభవం లేదు. ఇప్పటివరకు కేవలం 21 టీ20లు మాత్రమే ఆడాడు. అతడి పేరిట 29 టీ20 వికెట్లు ఉన్నాయి.

**సాకిబ్‌పై వేటు**

కాగా తొలి మ్యాచ్‌లో సాకిబ్ మహమూద్ 33 పరుగులిచ్చి 3 కీలక వికెట్లు పడగొట్టినప్పటికి.. ఆర్చర్ కోసం అతన్ని పక్కన పెట్టడం గమనార్హం. 2026 టీ20 ప్రపంచకప్ తర్వాత ఆర్చర్‌కు ఇదే మొదటి అంతర్జాతీయ టీ20 మ్యాచ్. కచ్చితంగా పవర్‌ప్లేలో అతడి నుంచి భారత బ్యాటర్లకు కఠిన సవాల్ ఎదురు కానుంది.



**ఇంగ్లండ్ తుది జట్టు**
ఫిల్ సాల్ట్, జోస్ బట్లర్, హ్యారీ బ్రూక్ (కెప్టెన్), జాకబ్ బెథెల్, టామ్ బాంటన్, సామ్ కరన్, విల్ జాక్స్, లియామ్ డాసన్, జోఫ్రా ఆర్చర్, ఆదిల్ రషీద్, జోష్ టంగ్.

## వరసగా నాలుగోసారి 16వ రౌండ్‌కు స్విట్జర్లాండ్.. అల్జీరియా ఖేల్‌ఖతం..!



ఫిఫా వరల్డ్‌కప్ 2026 నాకౌట్ దశలో స్విట్జర్లాండ్ దుమ్మురేపింది. ఉత్కంఠ రేపిన 32వ రౌండ్‌లో సాంకేతికంగా బలమైన అల్జీరియాను చిత్తుగా ఓడించింది. ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా 2–0తో గెలుపొందిన స్విస్ టీమ్ 16వ రౌండ్‌కు దూసుకెళ్లింది. ఫిఫా వరల్డ్‌కప్‌లో నాలుగోసారి స్విట్జర్‌లాండ్ ఈ రౌండ్‌లో ప్రవేశించింది. స్విట్జర్‌లాండ్ జట్టు 16వ రౌండ్‌లో అడుగుపెట్టింది. శుక్రవారం జరిగిన 32వ రౌండ్‌లో అల్జీరియాపై సంపూర్ణ ఆధిపత్యం చెలాయించిన స్వీస్ టీమ్ 2–0తో ముందంజ వేసింది. మెగా టోర్నీలో గొప్పగా రాణిస్తున్న అల్జీరియా వ్యూహాల్ని స్విట్జర్‌లాండ్ సమర్థంగా తిప్పికొట్టింది. ఆట మొదలైన 10వ నిమిషంలోనే జోహన్ మన్జాంబి గోల్ అందించాడు. అల్జీరియా ఆటగాళ్ల నుంచి చాకచక్యంగా బంతిని తప్పించిన జోహన్.. ఎడమవైపు నుంచి బంతిని గోల్ పోస్ట్‌లోకి పంపాడు. రెండో అర్ధ భాగం ఆరంభంలోనే డాన్ డోయో మరో గోల్ కొట్టగా స్విట్జర్‌లాండ్ 2–0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఊహించని ఓటమితో అట్లాస్ లయన్స్ ఇంటిదారి పట్టగా.. ఆ జట్టు కెప్టెన్ రియాజ్ మహ్రేజ్ అంతర్జాతీయ కెరీర్ సైతం ముగిసినట్టైంది.

**స్పోర్ట్స్**

## వైభవ్ సూర్యవంశీ అరంగేట్రంపై రచ్చ.. స్పందించిన బీసీసీఐ



టీమిండియా తరపున అరంగేట్రం కోసం యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ నిరీక్షణ కొనసాగుతోంది. ఐర్లాండ్ సిరీస్‌లో రెండు మ్యాచ్‌లకు బెంచ్‌కే పరిమితమైన వైభవ్.. ఇప్పుడు ఇంగ్లండ్ టూర్‌లోనూ డెబ్యూ చేసే సూచనలు కనిపించడం లేదు. వర్షం కారణంగా రద్దు అయిన తొలి టీ20లో వైభవ్‌కు భారత తుది జట్టులో చోటు దక్కలేదు. అభిషేక్ శర్మ, సంజూ శాంసన్‌లనే ఓపెనింగ్ జోడీగా టీమ్ మేనేజ్‌మెంట్ కొనసాగిస్తోంది. సంజూ వరుసగా మూడు మ్యాచ్‌లలో విఫలం కావడంతో సూర్యవంశీకి తుది జట్టులో చోటు కల్పించాలన్న డిమాండ్లు ఎక్కువగా వినిపిస్తున్నాయి. హెడ్ కోచ్, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌లు మాత్రం సీనియర్ ప్లేయర్లకే మద్దతు ఇస్తున్నారు. దీంతో గంభీర్, అయ్యర్ తీరుపై చాలా మంది మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా కీలక వ్యాఖ్యలు చేశారు. కెప్టెన్, కోచ్ విమర్శలు చేయడం సరికాదని శుక్లా అన్నారు.
వైభవ్ సూర్యవంశీకి అద్భుతమైన టాలెంట్ ఉంది. అందులో ఎలాంటి సందేహం లేదు. ఐపీఎల్‌లో ఇప్పటికే తనను తాను నిరూపించుకున్నాడు. జట్టు మేనేజ్‌మెంట్‌పై వస్తున్న విమర్శలు నా వరకు వచ్చాయి. నేను ఒక్క విషయం స్పష్టం చేయాలనుకుంటున్నాను. మ్యాచ్ పరిస్థితిని బట్టి కోచ్, కెప్టెన్ తుది నిర్ణయం తీసుకుంటారు. సరైన సమయం వచ్చినప్పుడు వైభవ్‌కు ఖచ్చితంగా అవకాశం లభిస్తుంది. అంతవరకు ఇలాంటి అనవసర విమర్శలు చేయడం ఆపాలి." అని 'టైమ్స్ నౌ'తో శుక్లా పేర్కొన్నారు.

# రఫ్ అయిన నువ్వు.. టఫ్ అయిన నేను! పర్పుల్ లెహంగాలో దివి వడ్త్యా కిల్లర్ లుక్స్



బిగ్‌బాస్ బ్యూటీ, టాలెంటెడ్ యాక్ట్రెస్ దివి వడ్త్యా సోషల్ మీడియాలో సరికొత్త ఫొటోషూట్‌తో సెన్సేషన్ క్రియేట్ చేసింది. వైబ్రంట్ పర్పుల్ కలర్ లెహంగా చోళీలో దేవకన్యలా మెరిసిపోతూ కుర్రాళ్ల గుండెల్లో రైళ్లు పరిగెత్తించింది. 'రఫ్ అయినా నువ్వు .. టఫ్ అయినా నేను .. మిక్స్ అయ్యే కాలం వచ్చిందిలే' అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె పెట్టిన క్రేజీ క్యాప్షన్, షేర్ చేసిన గ్లామరస్ ఫొటోలు ఇప్పుడు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.

**అదిరిపోయిన పర్పుల్ ట్రెడిషనల్ లుక్:**

ఈ ఫొటోషూట్ కోసం దివి డిజైనర్ పర్పుల్ లెహంగాను ఎంచుకుంది. ఆమె వేసుకున్న బ్లౌజ్‌పై అద్భుతమైన ఫ్లోరల్ ఎంబ్రాయిడరీతో పాటు మధ్యలో నెమలి మోటిఫ్ డిజైన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇక దీనికి మ్యాచింగ్ లావెండర్ పర్పుల్ స్కర్ట్, హెవీ గోల్డ్ చోకర్ నెక్లెస్, పెద్ద జుంకాలు మరియు సాంప్రదాయ గాజులతో దివి రాయల్ లుక్‌లో అదరగొట్టేసింది. ఈ ట్రెడిషనల్ మేకోవర్ ఆమె అందాన్ని మరింత పెంచేసింది.

**మహర్షి నుండి పుష్ప 2 వరకు క్రేజీ జర్నీ:**

మహేష్ బాబు మహర్షి సినిమాతో కెరీర్ స్టార్ట్ చేసిన దివి.. మెగాస్టార్ 'గాడ్‌ఫాదర్' చిత్రంలో 'రేణుక' పాత్రతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఆ తర్వాత రుద్రాంగి, లంబసింగి, సింబా సినిమాలతో పాటు, ఇక పాన్ ఇండియా హిట్ పుష్ప 2లో న్యూస్ రిపోర్టర్‌గా మెరిసింది. అలాగే ఓటీటీలో మా నీళ్ల ట్యాంక్, ఏటీఎం వంటి పాపులర్ వెబ్ సిరీస్‌లలో తన బోల్డ్ అండ్ ఎంటర్‌టైనింగ్ నటనతో మెప్పించింది.

**చేతినిండా ఆఫర్లతో ఫుల్ బిజీ:**

రీసెంట్ గా దివి కెరీర్ పీక్స్‌లో ఉంది నవీన్ చంద్రతో కలిసి 'హనీ' అనే సైకలాజికల్ హారర్ థ్రిల్లర్‌లో నటించిన ఈమె, బాలీవుడ్‌లో సన్నీ డియోల్ గత ఏడాది వచ్చిన యాక్షన్ మూవీ 'జాత్'లో పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్ర మెరిసింది. ఇక వీటితో పాటు 'కర్మస్థలం' అనే పాన్ ఇండియా యాక్షన్ మూవీలో లీడ్ రోల్ లో అలరించింది. ఇక ఇప్పుడు 'ద్రౌపతి 2' వంటి సరికొత్త సిరీస్ ప్రాజెక్ట్‌ల చర్చల్లోనూ ఆమె ఉంది.

**ఫొటోషూట్లతో ఇండస్ట్రీని షేక్ చేస్తూ..:**

గతంలో కంటే ఇప్పుడు దివి గ్లామర్ డోస్ పెంచి, నెక్స్ట్ లెవెల్ ఫొటోషూట్లతో కెవ్వుకేక పుట్టిస్తోంది. కేవలం లైక్స్ కోసమే కాకుండా, నటిగా తనలోని అన్ని కోణాలను నిరూపించుకోవడానికే ఈ రేంజ్‌లో ఫోజులు ఇస్తోందని టాక్. ఇక ఈ క్రేజీ ఫొటోల వల్లే ఇండస్ట్రీ వర్గాల నుండి ఆమెకు ఇప్పటికే రెండు పెద్ద ఆఫర్లు వచ్చాయని, టాలీవుడ్‌తో పాటు కోలీవుడ్ నుంచి కూడా పిలుపులు వస్తున్నాయని టాక్.
దివికి గనక ఒక్క మంచి సాలిడ్ ఛాన్స్ వస్తే కచ్చితంగా సెన్సేషన్ క్రియేట్ చేస్తుందని అభిమానులు గట్టిగా నమ్ముతున్నారు. తాజాగా ఆమె పోస్ట్ చేసిన పర్పుల్ లెహంగా లుక్స్ చూస్తుంటే, హీరోయిన్‌గా టాలీవుడ్‌ను ఏలే రోజులు దగ్గరలోనే ఉన్నాయనిపిస్తోంది. మరి ఈ బ్యూటీ ముందు ముందు ఎలాంటి వండర్స్ క్రియేట్ చేస్తుందో చూడాలి..



**ఫేమ్- కోసం ఇలాంటి పోజులు అవసరమా? ఆలయపై ట్రోలింగ్**

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com